బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం, 03 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

## సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం



## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 02 :** వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు. వివరాలు 3లో..

## 200 సీట్లలో గెలవబోతున్నాం

### ఎగ్జిట్ పోల్స్ నమ్మబోమన్న మమత



**కోల్‌కతా,మే2 :** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంనాడు ఆమె మాట్లాడారు. '200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం' అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్కెను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు. సీఏపీఎఫ్ దౌర్యనాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు. కాగా, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారంనాడు రీపోలింగ్ జరిగింది. పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ క్రమంలో సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు సైతం చోటుచేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. వివరాలు 3లో..

## రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

- సిద్దిపేట ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం



**సిద్ధిపేట,మే2 :** రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ శ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభు త్వం రుణ మాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిం దని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రం లోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్ధిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్క గా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేప డానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నా రని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కొనే వారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు. వివరాలు 3లో..

## ఓట్ల లెక్కింపులో ఇసి మరో కీలక నిర్ణయం

### అదనపు పరిశీలకులను నియమిస్తూ ఆదేశాలు



**కోల్‌కతా,మే2 :** ఓట్ల లెక్కింపు తేదీ సమీపిస్తున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల సంఘం అదనపు పరిశీలకులను మోహరించింది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాల్లో మొత్తం 165 మంది ఎన్నికల, 77 మంది పోలీసులను పరిశీలకులుగా నియమించింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సురక్షితంగా, పారదర్శకంగా సాగేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతల ఏర్పాట్లను పోలీసు పరిశీలకులు పర్యవేక్షిస్తారని తెలిపింది. ఈసీఐనెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారిని మాత్రమే వివరాలు 3లో..

## రంగారెడ్డి జిల్లా నేతలతో కెటిఆర్ భేటీ



- సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చ

**హైదరాబాద్,మే2 :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలోఈ సమావేశం నిర్వహించారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, రానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, కమిటీల నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. అలాగే స్పెషల్ ఇం టెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో చేపట్టా ల్సిన కార్యాచరణపై కూడా ఈ భేటీలో చర్చించారు. స్థానిక సంస్థల (పంచాయతీ, మున్సిపల్) ఎన్నికల్లో మంచి విజయాలు నమోదు చేసిన పార్టీ నేతలను కేటీఆర్ అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత



**హైదరాబాద్,మే2 :** తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకుపోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు.ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శిం చారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు వివరాలు 3లో..

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**రంగారెడ్డి,మే2 :** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరి ధిలో విషాదం చోటు చేసుకుంది. డీజిల్ పోసు కొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘ టన కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కుటుంబం.. రెండేళ్లుగా బడంగ్‌పేట్ న్యూ మారుతి నగర్‌లో నివాసముంటోంది. ఈ కుటుంబానికి చెందిన ఓ యువతి గండిపేట లోని ఎంజీఐటీ కాలేజీలో బీటెక్ మూడో సంవ త్సరంచదువుతోంది. వివరాలు 3లో..

## డ్రగ్స్ నిర్మూలనకు ఉమ్మడి కృషి

- సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే పిలుపు




**సిరిసిల్ల,మే2 :** డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా శనివారం సిరిసిల్లలో నిర్వహించిన 2ఐ రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి పాల్గొన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగల వారిగా వ్యవహరించి, డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతినడంతో పాటు, ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుందని చెప్పారు. అలాగే డ్రగ్స్ వినియోగం శారీరక నష్టాలకే పరిమితం కాకుండా మానసిక సమస్యలు, సామాజిక రుగ్మతలను కూడా పెంచుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి , యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాదకద్రవ్యాల వల్ల వచ్చే అనార్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచిం చారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో నెంబర్ 8712671111 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## మందుపాతర పేలి ముగ్గురు జవాన్ల మృతి

**కాంకేర్,మే2 :** కాంకేర్ జిల్లాలో భూమిలో ఉన్న మందు పాతరలను తొలగించే క్రమంలో ఓ మందుపాతర (ఐఇడి) పేలి ముగ్గురు జవాన్లు మృతి చెందారు. ఈ ఘటన శనివారం కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దు సమీపంలో జరిగింది. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసుల బృందం మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించే క్రమంలోనే ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)లు. ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కొర్మా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలేలు పోలీసులు ధృవీక రించారు. ఈ ఘటనలో మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోర్మా తీవ్ర గాయాల పాలయ్యారు. ఆయన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.

## అమెరికాలోనే ఇంధన ధరల మోత

### సర్వీసులను నిలిపివేసిన స్పిరిటి ఎయిర్‌లైన్స్ సంస్థ



**న్యూయార్క్,మే2 :** ఇంధన ధరల పెరుగుదలతో కష్టాల్లో కూరుకుపోయిన అమెరికా విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ ఫ్లైట్ సర్వీసులు అన్నిటినీ రద్దు చేశామని తాజాగా ప్రకటించింది. త్వరలో అన్ని కార్యకలాపాలకు ఫుల్ స్టాప్ పెడతామని శనివారం ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో ఉన్నామని, ఇంధన ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో మరోదారి లేక ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ వెల్లడించింది. 'అన్ని స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సర్వీసులను రద్దు చేశాము. మా ప్రయాణికులు ఎయిర్‌పోర్టులకు వెళ్లవద్దని సూచిస్తున్నాము' అని ఎయిర్‌లైన్స్ మాతృసంస్థ స్పిరిట్ ఏవియేషన్ హోల్డింగ్స్ ఒక ప్రకటనలో తెలిపింది. కస్టమర్ సర్వీస్ అందుబాటులో లేదని కూడా సంస్థ వెబ్‌సైట్‌లో నోటీసు కని పించింది. అయితే, ఇప్పటికే టికెట్లు వివరాలు 3లో..

# సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్



● ఐపిఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్

ముఠాల ఆటకట్టు

హైదరాబాద్,మే2 : ఆన్‌లైన్ బెట్టింగ్, నకిలీ పెట్టుబడి స్కామ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఏప్రిల్ నెలలోనే 184 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తొలగించగా.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో 801 ఫేక్ యాడ్స్‌ను గుర్తించారు. అమాయకులను టార్గెట్ చేసి వారిని బెట్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌ల వైపు మళ్లించే ప్రొఫైల్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. డీప్‌ఫేక్ వీడియోలను ఉపయోగించి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఐపీఎల్ పేరుతో అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహించే ఈ ప్రొఫైల్స్ ద్వారా యువతను ఆకర్షించి మోసం చేస్తున్నట్లు పోలీ సులు గుర్తించారు. నిరంతర సైబర్ పెట్రోలింగ్‌లో భాగంగా ఇప్పటివరకు 427 సోషల్ మీడియా ప్రొఫై ల్స్‌ను, 1,903 పెయిడ్ ప్రమోషనల్ అడ్ డవలప్ మెంట్లను గుర్తించి తొలగించారు. ఈ ప్రొఫైల్స్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇప్పటికే 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అక్రమ డబ్బు మార్గాలపై దృష్టి సారించిన పోలీ సులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# సంపన్న అమ్మాయిలే టార్గెట్



● ఇన్‌స్టా వేదికగా వలపు వల
● ట్రాప్ చేసి లక్షల్లో వసూళ్లు
● ఇద్దరు కేడీల్లో ఒకరి అరెస్ట్

హైదరాబాద్,మే2: ఇన్‌స్టాగ్రామ్ వేదికగా యువతులను, ముఖ్యంగా సంపన్న కుటుంబాలకు చెందిన అమ్మా యిలను మాయమాటలతో ట్రాప్ చేసి లక్షలాది రూపా యలు వసూలు చేస్తున్న ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీ సులు రట్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న అర్జున్, అతని సోదరుడు రాజీవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలో అర్జున్, రాజీవ్‌ను ప్రధాన సూత్రధా రులుగా గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయమైన ప్రొ ఫైల్‌ను మెయింటెన్ చేస్తూ అమ్మాయిలను బుట్టలో వేసు కోవడం నిందితుల ప్లాన్ అని పోలీసులు చెప్పారు. ఇప్పటికే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మోసాల్లో రాజీవ్ క్రియాశీలకంగా వ్యవహ రించాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. పరారీలో ఉన్న రాజీవ్‌ను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బెంగళూరులో పట్టుకున్నారు. నిందితులు యువతులను ట్రాప్ చేయడానికి ఒకపక్కా ప్లాన్ ప్రకారం వ్యవహరించేవారని పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఖరీదైన కార్లు, బ్రాండెడ్ దుస్తులు, విలాసవంతమైన హో టల్స్‌లో దిగిన రీల్స్, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారని అన్నారు. తాము కూడా పెద్ద ధనవంతులమని యువతులను నమ్మించేవారని చెప్పారు. హైదరాబాద్‌లోని విలాసవంతమైన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్‌లలో నివసించే సంపన్న కుటుంబాల పిల్లలను ఈ నిందితులు ప్రధానంగా లక్ష్యంగా చేసుకునేవారని వెల్ల డించారు. అమ్మాయిలను పరిచయం చేసుకున్న కొద్దిరోజులకే ప్రేమ నటిస్తూ, పెళ్లి చేసుకుంటామని నమ్మబలికేవారని అన్నారు. యువతుల నమ్మకాన్ని పొందిన తర్వాత అసలు పని మొదలుపెట్టేవారని తెలిపారు. సాన్నిహిత్యం పెరిగిన తర్వాత అమ్మాయిల వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరి ంచి, వాటిని అడ్డం పెట్టుకుని భయపెట్టడం, అత్యవసరాల పేరుతో భారీగా డబ్బులు వసూలు చేసేవారని పోలీసులు వెల్లడించారు. నిందితులు దాదాపు 10 మందికి పైగా యువతులను ఇదే తరహాలో ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తెను కూడా ప్రేమ పేరుతో వేధించి, బ్లాక్‌మెయిల్ చేస్తూ సుమారు రూ. 13 లక్షల నగదును వసూల్ చేశారని పోలీసులు తెలిపారు. నిందితుడు అర్జున్‌పై కేవలం జూబ్లీహిల్స్‌లోనే కాకుండా, నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యా యని అన్నారు. నిందితులను సమగ్రంగా విచారించేందుకు జూబ్లీహిల్స్ పోలీసులు వారిని కస్టడీలోకి తీసుకున్నారు. వీరు ఇంకా ఎంతమంది దగ్గర డబ్బులు వసూలు చేశారు? ఈ ముఠాలో ఇంకా ఎవరైనా సభ్యులు ఉన్నారా?, వీరు వసూలు చేసిన సొమ్మును ఏం చేశారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రాజీవ్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించి, అర్జున్‌తో కలిపి విచారించే అవకాశం ఉంది.

# సిబ్బంది, ప్రయాణజకులతో మర్యాదగా ఉండాలి



వేధింపులకు గురిచేయడం సరికాదు

ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

హైదరాబాద్,మే2 : కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సాను కూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శు క్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశా లపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహ పూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణి కులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌ లిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎ÷-లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించుకోవాల న్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయా లని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబా టులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొ దలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచిం చారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా



● బిఆర్ఎస్‌కు ఎమ్మెల్యే దానం కౌంటర్

హైదరాబాద్,మే2 : ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంటూ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎద్దేవా చేశారు. గతంలో జరిగినఫోన్‌ట్యాప్ వ్యవహారంపై సమాధానం చెప్పా లన్నారు. కానీ దానికి సమ్మాదనం చెప్పకుం డా బురదజల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నా రని దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కు వైందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొ చ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదాఅని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టా లని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. శనివారం హైదరాబాద్‌లో దానం నాగేందర్ మాట్లాడారు. మా జీ సీఎంకేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లి దండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకుతీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# జూలూరుపాడులో నేడు హిందూ సమ్మేళనం



ఖమ్మం,మే2 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని చంద్రుగొండ రోడ్డు, గుండెపుడి సమీపంలో గల ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిం చనున్న 'హిందూ సమ్మేళనం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు శనివారం సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను కమిటీ సభ్యులు విడుదల చేశారు. ?ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సొడె శ్రీరామ్ మాట్లాడుతూ..'గడప లోపల కులం..గడప దాటితే మనమంతా హిందువులం' అనే నినాదంతో ఈ భారీ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమాజంలో ఉన్న భేదాలను పక్కనపెట్టి, ధార్మిక, సాంస్కృతిక విలువలను రక్షిం చుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఐక్యతా సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయా లన్నదే తమ ముఖ్య ఉద్దేశ మని, గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరి భాగస్వా మ్యం తో ఈసమ్మేళనంచారిత్రాత్మకంగా నిలవాలని ఆయన ఆకాంక్షిం చారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ, హిందూ బంధువులంతా స్వచ్ఛ ందంగాతరలివచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులుచెంగలనరసింహారావు,వందనపు కమలాకర్ పాల్గొన్నారు.

# సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం





● ఉస్మానియా మార్చురీ వద్ద

మృతులకు నివాళి

హైదరాబాద్,మే2 : శంషాబాద్ వద్ద ఓఆర్ ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పిం చారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సా యంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలి కితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాత పడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# పాలమూరు పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్,మే2 : మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, అధునాతన హంగులతో నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భారీ నిధులు సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతునట్లు పేర్కొన్నారు. మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్‌కు కార్పొరేషన్, ముడా ఛైర్మన్లతో కలిసి శంకుస్థాపన చేశారు. నగర సుందరీకరణలో భాగంగా పట్టణంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో పార్కులు, ఓపెన్ జిమ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే మూడా ఆధ్వర్యంలో అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడిం చారు. జిల్లా కేంద్రంలో ఉన్న మైదానాలకు వేలాది మంది వాకర్స్ వస్తుండటంతో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

# కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లిపై పరువనష్టం కేసు




మాజీమంత్రి షబ్బీర్ అలీ కుమారుడు

ఇలియాస్ దాఖలు

కామారెడ్డి,మే2 : కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసిం ది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సు మంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయ వాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియ జేశారు. గత ఫిబ్రవరి 17,21 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్‌పై అత్యాచారం కేసు ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయి ంచినట్లు తెలిపారు. దీంతో ఫిర్యాదు పూర్వా పరాలను పరిశీలించిన కోర్టు.. క్రిమినల్ డిఫెన్స్ కింద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేస నట్లు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. ఈ విలేక రుల సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో విషాద ఘటన



## నవదంపతుల ఆత్మహత్య

హైదరాబాద్,మే2 : హైదరాబాద్ కూకట్‌పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజు ల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయిజన్ తీసుకొన్న ట్లు సమాచారం. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవక ముందే ఆత్మ హత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్ లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లా డుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలి యదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పు కొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్తీక్ ఇంట్లో క్లూస్ టీం తో ఆధారాల సేకరిస్తున్నాం.. సూసైడ్ నోట్ లభించలేదని సీఐ శోభన్ తెలిపారు.

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే

హైదరాబాద్,మే2 : హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు.

# బీమా రంగంలో వందశాతం విదేశీప్రత్యక్ష పెట్టుబడులు

ఎల్ఐసిలో మాత్రం 20శాతానికే పరిమితం

చట్టానికి చేసిన మార్పులపై కేంద్రం నోటిఫై




న్యూఢిల్లీ,మే2 : బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐ అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడిదారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. ఇప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండి పోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగదారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

## (మొదటిపేజీ తరువాయి)

## ఉద్యోగుల సంక్షేమానిక కట్టుబడి ఉన్నాం

జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అంది స్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజా న వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. 'ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది' అంటూ సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పించారు.

## ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

ఉత్తమ్ శాఖలో జరుగు తోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఓట్ల లెక్కంపులో ఇసి మరో కీలక నిర్ణయం

కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు పేర్కొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ కొనసాగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికి 86 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మరోవైపు ఓట్ల లెక్కింపు తర్వాత తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇదే జిల్లాలోని ఫల్తాలో వందలాది మంది నిరసన చేపట్టారు. ఈ ప్రాంతంలోని టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణ హాని ఉందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తమపై దాడులు చేస్తామని వారు బెదిరించారని ఆరోపించారు. సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఆ ప్రాంతాన్ని సందర్శించి.. భద్రతకు భరోసా ఇచ్చారు. స్థానిక తృణమూల్ అభ్యర్థి జహంగీర్ ఖాన్ ఈ ఆరోపణలను ఖండించారు. ఇదంతా భాజపా పనేనని ఆరోపించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

రోజూలాగే కాలేజీకి వెళ్లినఆమె ఈమధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిం దని..ఆతర్వాత ఇంట్లో ఉన్న డీజిల్‌ను పోసు కొని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలి పారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్ పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కున్నారు. మృతదేహాన్ని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరు డు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చారు. ఘటనకు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీగా బలగాలను మోహరించినా టీఎంసీ గూండాల హింస, ఆందో ళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్ట్రాంగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను ఈసీ సీరియస్‌గా తీసుకుందని, స్థానికులను బెదిరించిన టీఎంసీ గూండాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించిందని అధికారులు చెప్పారు.

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పా రు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టిం చడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగు తుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శిం చలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

## అమెరికాలోనే ఇంధన ధరల మోత

కొన్న వారికి డబ్బుల రీఫండ్ పక్రియను త్వరలో ప్రారంభిస్తామని కూడా సంస్థ తెలిపింది.ఇక స్పిరిట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల నిలిపివేతపై కంపెనీ అధ్యక్షుడు, సీఈఓ దేవ్ దేవిస్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న సంస్థ పునర్వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌పై బాండ్ హోల్డర్స్‌తో మార్చి నెలలో అంగీకారం కుదిరిరిందన్నారు. అయితే, అకస్మాత్తుగా విమాన ఇంధన ధరలు పెరగడంతో పరిస్థితి చేయిదాటి పోయిందని అన్నారు. కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయడం మినహా మరో దారి లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. 'వ్యాపారాన్ని కొనసాగించేందుకు వందల మిలియన్ల నిధులు కావాలి. మా వద్ద అంత డబ్బు లేదు. నిధులను సమీకరించే అవకాశం కూడా లేదు. ఇది చాలా విచారకరమైన పరిణామం' అని అన్నారు. ఇరాన్‌తో యుద్ధం మొదలయ్యాక అమెరికాలో విమాన ఇంధన ధరలు రెండింతలు అయ్యాయి. దీంతో, అనేక ఎయిర్‌లైన్స్ ఇప్పటికే ఈ ఏడాది లాభాల అంచనాలను తగ్గించుకున్నాయి. కార్యకలాపాల విస్తరణపై పెట్టుబడులకు కూడా బ్రేక్ చెప్పాయి. అప్పుల భారం, కార్యనిర్వహణ వైఫల్యాల కారణంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ 2024 నవంబర్‌లోనే దివాలా తీసినట్టు ప్రకటించింది. ఆ తరువాత పునర్వ్యవస్థీకరణ ఎ÷-లాన్‌లో భాగంగా మళ్లీ కార్యకలాపాలను ప్రారంభించింది. కంపెనీని పూర్తిగా గ్టటెక్కించేందుకు మరో ప్రణాళికపై కూడా చర్చలు జరుగుతున్నాయి. సంస్థను ఆదుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం శుక్రవారం ఒక ఎ÷-లాన్‌ను ప్రతిపాదించింది. ఇదే తన చివరి ఆఫర్ అని కూడా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ క్రమంలోనే శనివారం స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

- ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మే 02 :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీ ధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ' అనే అంతర్జాతీయ వేదిక లోగోను అధికారి కంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపా రులు, ఎగుమతిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లా డుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువ తకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగు మతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాలను సద్విని యోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్ ను ఈ సంద ర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతి భను ప్రపంచానికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వా మ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించను న్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

## పాశ్చాత్య ప్రభావంతో మనదేశంలోనూ మార్పులు

- సమాజంలో కొరవడుతున్న ప్రశాంతత
- ఆధ్యాత్మిక చింతనతోనే పరిష్కారం
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



**నెల్లూరు,మే2 :** పాశ్చాత్య వ్యామోహం ఎక్కువై మనదేశంలో కూడా మార్పులు వస్తున్నాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. రోజూ పత్రికల్లో వచ్చే వార్తలను చూస్తోంటే సిగ్గేస్తోం దని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఎక్కడ చూసినా నేరాలు, ఘోరాలు, అశాంతి కనిపిస్తోందని అన్నారు. ఈ క్రమంలో మనిషి ఆధ్యాత్మిక జీవనం అలవర్చుకోవాలన్నారు. శని వారం నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం గొలగ మూడిలో ఆయన పర్యటించారు. శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి జీవిత చరిత్ర, విశ్వంభరుడు పుస్తకాన్ని ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేశ్ రెడ్డి, దీపావెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఆధ్యాత్మికత మానసిక ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు పిల్లలకు సమయాన్ని కేటాయించట్లేదని.. మొబైల్, టీవీలకు మాత్రమే సమయాన్ని కేటాయించడం సరికాదని పేర్కొ న్నారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని ఏడాదిలో ఒక్కసారి మాత్రమే దర్శించుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. సమాజం గతితప్పినప్పుడే వారిని సరైన మార్గంలో పెట్టేందుకు దివ్య స్వరూపులైన యోగి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి, పుట్టపర్తి సాయిబాబా, షిర్డీ సాయిబాబా లాంటి అవధూతలు భూమిపైకి వచ్చారని ప్రస్తావించారు. ఏదైనా పని చేయాలంటే మనసులో, కుటుంబంలో, గ్రామంలో, రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో కూడా శాంతి ఉండాలని సూచించారు. ఏపీ విద్యశాఖ మంత్రి నారా లోకేశ్ పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. ఈ ఏడాది పదోతరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకువచ్చారని కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పాయ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో నాలుగుసార్లు కేంద్రమంత్రిగా, ఉపరాష్ట్రపతి పదవులు స్వీకరించానని ప్రస్తావించారు. తన కుమారుడు హర్షవర్ధన్, కుమార్తె దీపా వెంకట్‌లతో... వారి వ్యాపారాల్లో తాను కలగజేసుకోనని, తన రాజకీయాల్లోకి వారు రావొ ద్దనే గౌరవ ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. మంచి పనులు చేసే వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని వెంకయ్యనాయుడు సూచించారు.



## కార్మికుల సంక్షేమం కోసమే లేబదర్ అడ్డాలు

**వాటిని ననైపుణ్య శిక్షణ కేంద్రలుగా మారుస్తున్నాం**

**మంత్రి వాసంశెట్టి శుభాశ్ వెల్లడి**



**అమరావతి,మే2 :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ కార్మికుడిలా శ్రమిస్తూ కార్మికుల భద్రత, సం క్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తు న్నారని మంత్రి వాసంశెట్టి శుభాశ్ అన్నారు. ప్రభు త్వం ఏర్పాటు చేసే లేబర్ అడ్డా నిర్మాణాలు.. అం దరికీ పని దొరికేలా చూడటంతో పాటు నైపుణ్య శిక్షణా కేంద్రాలుగానూ మారతాయన్నారు. అమరా వతి, పోలవరం సహా వివిధ పెట్టుబడుల నిర్మాణా లకు సంబంధించి కార్మికులకు అపార అవకాశాలు రాష్ట్రంలోనే ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేసిందని మంత్రి విమర్శించారు. ఇసుకను బం గారం చేసి, ఒక ఇటుక కూడా పేర్చక పోగా కార్మి కుల భద్రత విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి లేన ట్లుగా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, కొత్త ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభు త్వం తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గాయన్నారు. మన మిత్ర యాప్ ద్వారా భవన నిర్మాణ కార్మికులకు రిజిస్ట్రే షన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామ న్నారు. ప్రజలే తన యజమానులు అంటూ రోజుకు 18 గంటల పాటు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నిరంతర శ్రామికుల్లా పని చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాశ్ పేర్కొన్నారు.

## సింగపూర్‌లో విద్యావిధానం అమలు


**పర్యటనకు 37మంది టీచర్ల ఎంపిక**

**4 నుంచి 9 వరకు పర్యటించనున్న బృందం**



**అమరావతి,మే2 :** ఏపీలోని ఉత్తమ ఉపాధ్యా యులను అంతర్జాతీయ స్థాయి విద్యా వ్యవస్థలను అధ్యయనం చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఏపీ ఉపాధ్యాయుల బృందం.. సింగపూర్‌కు వెళ్ల నుంది. ఈ నెల 4 నుంచి 9 వరకు సింగపూర్‌లో ఈ బృందం పర్యటించనుంది. సింగపూర్ పర్య టనకు ఏపీలో 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో బృం దాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలి పారు. సింగపూర్‌లో అత్యాధునిక విద్యా విధానా లు, బోధ నా పద్ధతులు, పాఠశాలల్లో అమలవు తున్న వినూత్న ప్రయోగాలు, విద్యార్థుల అభివృద్ధి వ్యవస్థలను ఉపా ధ్యాయులు సమగ్రంగా అధ్యయ నం చేయనున్నారు. ఇప్పటికే ఈ బృందం విజయ వాడ నుంచి హైదరా బాద్‌కు బయలు దేరింది. అక్కడి నుంచి సింగ పూర్‌కు విమానం ద్వారా ప్రయాణించనున్నారు. మిగిలిన ఉత్తమ ఉపాధ్యా యులను అధ్యయనం కోసం త్వరలో ఫిన్లాండ్‌కు పంపించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రాథ మిక విద్యలో ప్రపంచానికే ఫిన్లాండ్ ఆదర్శంగా నిలిచింది. ఈ రెండు దేశాల అనుభవాలను విని యోగించి ఏపీలో విద్యా రంగా న్నిమరింత బలోపేతంచేయాలనేదిప్రభుత్వ ఆలోచన.

## పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ



**హైదరాబాద్,మే2 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుం టున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకా ంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు.తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతు తెలిపారు.

## పదిలమైన ప్రతిభకు కీర్తి కిరీటం!

**విజయవాడ,మే2 :** విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తున్నానని, ఈ విజయం స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శని వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మం దిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని అత్యుత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులను, వారి తల్లి దండ్రులను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి సత్కరించారు. అధికారులు, ఉపాధ్యాయులకు అభి నందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠ శాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటి ష్టంగా అమలుచేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. గరిష్ఠంగా 595 మార్కులు రాగా.. 31 మంది విద్యార్థులు 580, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారన్నారు. 376 మంది విద్యా ర్థులకు 550కు పైగా మార్కులు వచ్చాయని అదే విధంగా 1,557 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యమైనా సాధించగలరని పేర్కొన్నారు. పదో తరగతి విజయాన్ని ఒక మొదటి మెట్టుగా భావించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు.

## ఎండాకాలంలో కోతలు ఉండకూడదు

- సరఫరాలో ఎక్కడా లోటు రానీయవద్దు
- అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచన

**అమరావతి,మే2 :** వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు ఉండటానికి వీల్లేదని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల తాత్కాలిక కరెంట్ సమస్యలు తలెత్తినా వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు.ఉత్పత్తి, సరఫరాలో ఎక్కడా లోటు రానీయవద్ద న్నారు.శనివారం విద్యుత్ సీఎండీలతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫ రెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారికంగా లేదా అనధికారికంగా ఏపీలో ఎక్కడా కరెంట్ కోతలు ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ కోత లు విధించాల్సి వస్తే ప్రజలకు ఆ సమాచారం చెప్పటంతో పాటు వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని మంత్రి దిశానిర్దేశర చేశారు.వేసవి డిమాండ్‌కు తగ్గట్లుగా సరిపడా కరెంట్ అందుబా టులో ఉన్నా అక్కడక్కడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని మంత్రి ఆరా తీశారు. అధిక ఉష్ణోగ్రతలతో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మ ర్‌లు కాలిపోవటం,అకాల వర్షాల వల్ల సమస్యలు తలెత్తుతున్నా యనిఅధికారులు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఆయా సమస్యల పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటూ పూర్తి అప్రమత్తంగాఉండాలనిమంత్రి రవికుమార్ ఆదేశించారు.

## అర్థరాత్ర యువకుడిపై దాడి

- ప్రాణాలు పోయేలా కొట్టి పడేసిన దుండగులు
- ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో యువకుడికి చికిత్స



**వనపర్తి,మే2 :** వనపర్తి మండలం పెద్దగూడెం గ్రా మంలో శు క్రవారం అర్ధరాత్రిదారుణఘటన జరిగింది.శివ(27) అనే యువ కుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి నట్లు సమాచారం.అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముం దు వదిలి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్ప త్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న ట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాం దోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## కోడెల శివప్రసాద్ జయంతి

**నివాళి అర్పించిన చంద్రబాబు, లోకేశ్**

**అమరావతి,మే2 :** టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కోడెల శివప్రసాద రావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ... పేదలకు రూపాయి వైద్యుడిగా కోడెల సేవలందిం చారని గుర్తు చేశారు. సంఘ విద్రోహ శక్తులు, ఫ్యాక్షనిస్టులకు ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారన్నారు. పల్నాడు అభివృద్ధికి కృషి చేసిన దూరదృష్టి ఉన్న నాయకుడు కోడెల శివప్రసాదరావు అంటూ సీఎం చంద్రబాబు కొనియాడారు. 'తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కొడాలి శివప్రసాద్ రావు జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. 'రూపాయి డాక్టర్'గా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా పల్నాడు అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. నూతన ఆంధ్రప్రదేశ్‌కు మొదటి స్పీకర్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. పల్నాడు టైగర్‌గా ప్రసిద్ధి చెందిన కొడాలి శివప్రసాద్ రావు జయంతి సందర్భంగా పార్టీకి, రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకుందామని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## సంపాదకీయం

# అప్పులు తీర్చడమెలా.. అన్న ఆలోచనేదీ?

అప్పులు తీర్చడమెలా..రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమెలా .. అన్న ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు. కెసిఆర్ చేసిన అప్పుల గురించి ప్రశ్నించినప్పుడు ఆస్తులు సృష్టిస్తున్నామని అనేవారు. ఎపిలో చంద్రబాబుది కూడా అదే పాలసీ. కెసిఆర్ అప్పులు చేసి దివాళా తీసాడని ఆరోపించి, అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అంతకు మించిన అప్పులు చేస్తున్నారు. చంద్రబాబు కూడా అదే కోవలో ఉన్నారు. జీతాలు, భత్యాలకు డబ్బులు లేవు. ఉచిత పథకాలకు మాత్రం చేతికి ఎముక లేదన్నంతగా దోచిపెడు తున్నారు. ఈ లెక్కన మరో వదందేళ్లయినా అప్పులు తేరవు. వీరు సృష్టించిన ఆస్తులు అప్పులు తీర్చలేవు. ఉన్న భూములను తెగనమ్మేస్తున్నారు. ప్రధానంగా ఖర్చులు తగ్గించుకుని అప్పులు లేకుండా చేసుకునే ప్రణాళికలు రచించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యం కావాలి. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదని గుర్తించాలి. పాలన పేరుతో రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం రేవంత్‌కి, చంద్రబాబుకు లేదు. అలాగే దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే ప్రయత్నాలను మోడీ కూడా సమర్థించరాదు. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలి. రైతులు పండించిన ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదు. దానిని ప్రజలకు చేరవేయడం లేదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోక పోవడం వల్లనే రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. నెలనెలా వడ్డీలకే వేలకోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా తీస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు ముందు పెన్షన్లు రద్దు చేయాలి. రాజకీయ ప్రాపకం కోసం అందరికీ కేబినెట్ హోదాతో సలహాదారులను నియించుకోవడం పక్కన పెట్టాలి. అలాగే వీరి జీతభత్యాలను కూడా కనీసానికి తగ్గించాలి. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్న వేళ, సలహాదారులకు లక్షల్లో జీతాలు తగలేయడం సరికాదు. ఇందుకోసం ఉన్న భూములను తెగనమ్మడం, లిక్కర్ ధరలు పెంచడం, భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెంచడం, పరోక్షంగా పన్నులు బాదడం వంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఇందులో అసలు లబ్దిదారుల కన్నా అనర్హులే ఎక్కువ మంది ఉన్నారు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. తాజాగా తెలంగాణలో మరో ఇద్దరు సలహాదారులను నియమించారు. ఇప్పటికే ఉన్నవారికి తోడు మరో ఇద్దరికి పునరావసం కల్పించాల్సిన అసవరం ఏమొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేండ్లలో 14మంది సలహాదారులుగా నియమితులయ్యారంటే..వారు ఏంచేస్తారని జనం ప్రశ్నించాలి. వీరంతా క్యాబినెట్ హోదా ఉన్నవారే కావడంతో జీతాలు, భత్యాలు సరేసరి. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు దాదాపు సమానంగా సలహాదారులు ఉన్నారు. వీరంతా లక్షలకు లక్షల జీతాలు, భత్యాలూ అందుకుంటున్నారు. సలహాదారులు రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తున్నారని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు మళ్లీ పలువురిని సలహాదారులుగా నియమించారు. అప్పులు తెచ్చి మరీ సలహాదారులకు జీతభత్యాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఇంతమంది సలహా దారులను ఎందుకు నియమిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు పోస్టులు సృష్టించిమరీ ఎందుకు నియమిస్తున్నారన్నది అర్థం కాదు. కెసిఆర్ చేసిన పనినే రేవంత్ కూడా చేస్తున్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను ఆగమేఘాల పై ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా విహెచ్‌ను, రిటైర్డ్ డిజిపి శివప్రసాద్ రెడ్డిని సలహాదారులుగా నియమించారు. సలహాదారుల పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పునరావాసం కోసం వాడుకొంటు న్నది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకే ఏడుగురు సలహాదారు లను తొలగించారు. 'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని ఆనాడు చెప్పారు. జనవరి 20న అంటే అధికారంలోకి వచ్చిన నెలన్నరకు సీఎం తనకు నమ్మకస్తుడైన వేం నరేందర్‌రెడ్డిని ప్రధాన సలహాదారుగా నియమించారు. క్యాబినెట్ హోదా కల్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ష బ్బీర్ అలీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ శాఖల ప్రధాన సలహాదారుగా, మరో సీనియర్ నేత హర్కర వేణుగోపాల్‌ను ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా నియమించి క్యాబినెట్ హోదా ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కేశవరావును పబ్లిక్ ఎఫైర్స్ సలహాదారుగా నియమించారు. మరో మాజీమంత్రి సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమించారు. వీరంతా ఏం సలహాలు ఇస్తారు. తెలంగాణ గట్టెక్కడానికి ఏం చేస్తారన్నది ప్రశ్న. ఖజానాకు గండిపడుతుంటే కొత్తగా ఖర్చులు చేయడం వల్ల ప్రజలపై భారం పడుతుంది. దీనిని లోచించాలి. ఇలాంటి వారిని ప్రజల నెత్తిన రుద్దడం సరికాదు. ఖర్చులు తగ్గించడానికి అవసరమైతే ఓ కన్సల్టెన్సీని నియమించడం మంచిదేమో.

# పెట్రో ధరలు పెంచడం లేదు


### ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వెల్లడి




**న్యూఢిల్లీ,మే1 :** దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు

# మహిళా మేయర్లు, ఛైర్‌పర్సన్లకు అవగాహన

- పట్టణ పరిపాలన, ప్రణాళికలపై రెండ్రోజుల శిక్షణ



**హైదరాబాద్,మే02:** మహిళాప్రజాప్రతినిధుల నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడం, పట్టణ పాలనలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే దిశగా వారిని తీర్చిదిద్దే లక్ష్యంతో రెండ్రోజుల శిక్షణ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, పురపాలక శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో వరంగల్, హైదరాబాద్ రీజియన్స్ పరిధిలోని మహిళా మేయర్స్ ,ఛైర్‌పర్సన్స్ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరుసగా రెండ్రోజులు పాటు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మహిళాప్రజాప్రతినిధుల నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడం,పట్టణ పాలనలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకునే దిశగా మార్గదర్శనం చేయడం లక్ష్యంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రటరీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టి.కే.శ్రీదేవి పాల్గొని నూతనంగా ఎన్నికైన మహిళలను అభినందించడం తో పాటు వారికి దిశ నిర్దేశం చేశారు. మున్సిపాలిటీల అభివృద్ధిలో చైర్ పర్సన్స్ మేయర్స్ పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, పట్టణాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. అదేవిధంగా, విధి విధానాల అమలు, ప్రజలతో అనుసంధానం, దీర్ఘకాలిక దార్శనికతతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ఏ పని చేసినా మానవీయ కోణంలో పని చేయాలని, ప్రజలకు మంచి చేయాలని ఉంటే చట్టం తప్పకుండా దారి చూపిస్తుందని, ఆర్థిక స్వాలంబన సాదించుకొని ప్రజల సేవలను మెరుగు పరిచే పథకాలను చేపట్టాలని కోరారు.దాదాపు 60 మందికి పైగా మహిళ ప్రజాప్రతినిధులు పాల్గొన్నరెండు రోజుల అవగాహన కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం మేయర్స్ మరియుచైర్‌పర్సన్స్ బాధ్యతలు, అధికారాలు, విధి నిర్వహణ విధానాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, వాటి అమలు విధానం, నిధుల వినియోగం, వివిధ పట్టణ అభివృద్ధి, ప్రణాళికల ఆధికారులు అవగాహన కల్పించారు. పాల్గొన్న ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను పంచుకోవడం ద్వారా పరస్పర అవగాహనను పెంపొందించు కున్నారు. అవగాహన కార్యక్రమం ద్వారా మహిళా ప్రజాప్రతినిధులుగా పట్టణ పాలనలో మరింత సమర్థతతో ముందుకు సాగేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు సంపాదించుకున్నమని హర్షం వ్యక్తం చేశారు.

# నేనసలే మంచి వాడిని కాను

- ఇరాను అణు ఒప్పందానికి రావాల్సిందే
- అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు
- మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, :** దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు.కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది (జా ఎసజీని బిిని‌బతినీనిబ). అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్ట్‌లో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయ లేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సం తకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొ చ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై- (ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్నితమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగు తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధించాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బంధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపి వేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివ ర్ణిం చింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికం గా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

- కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ
- హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం
- సిపిఐ జనగామ జిల్లా అద్యక్షుడు రాజిరెడ్డి

**జనగామ,:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లారుమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# పవన్ ఖేరాకు సుప్రీంలో ఊరట

### షరతులతో కూడిన బియెల్ మంజూరు




**న్యూఢిల్లీ,మే1 :** కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్యపై వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ క్రమంలో ఖేరాకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరుకావాలని పవన్ ఖేరాను న్యాయస్థానం ఆదేశించింది. సాక్ష్యాలు తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని పేర్కొంది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టం చేసింది. ఇక, విచారణ సమయంలో అవసరమని భావిస్తే.. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

# “సేవే పరమ ధర్మం” స్ఫూర్తితో వైద్యులు సేవలందించాలి



**ఉస్మానియా మెడికల్ కాలేజ్ 175వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపు**

**బలగం టీవీ, హైదరాబాద్**

వైద్య వృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, అది మానవాళికి సేవ చేయడానికి తీసుకునే పవిత్ర ప్రతిజ్ఞ అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. “సేవే పరమ ధర్మం” అనే మహోన్నత భావనతో వైద్యులు దేశ ప్రజలకు సేవలందించాలని ఆయన పిలుపునిచ్చారు.

హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజ్ 175వ స్నాతకోత్సవ కార్యక్రమానికి శనివారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ పట్టభద్ర విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వైద్యులు జ్ఞానం, సాంకేతిక నైపుణ్యంతో పాటు కరుణ, సానుభూతి వంటి మానవీయ విలువలను అలవరచుకోవాలని సూచించారు.

ఉస్మానియా మెడికల్ కాలేజ్ దేశానికి నిబద్ధతతో, నైపుణ్యంతో కూడిన వైద్యులను అందిస్తున్న గొప్ప వారసత్వ సంస్థగా నిలిచిందని కొనియాడారు. పట్టభద్రులైన విద్యార్థులు సాధించిన విజయానికి వారి కఠోర శ్రమ, అంకితభావమే కారణమని అభినందించారు.

ఆరోగ్య రంగంలో సాంకేతికత, పరిశోధనల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక పరికరాలను వినియోగిస్తూనే మానవీయతను మరువకూడదని గవర్నర్ హితవు పలికారు. రోగికి వైద్యుడిపై ఉన్న నమ్మకమే అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్నారు.

పట్టభద్రుల కుటుంబ సభ్యులు, అధ్యాపకుల పాత్రను ప్రత్యేకంగా ప్రశంసించిన గవర్నర్, వారి త్యాగం, మార్గదర్శకత్వం వల్లే విద్యార్థులు సమర్థులైన వైద్యులుగా ఎదిగారని అన్నారు. యువ వైద్యులు గ్రామీణ సేవ నుంచి అత్యాధునిక పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ నైతిక విలువలతో సేవ చేయాలని సూచించారు.

అంతకుముందు గవర్నర్ వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కే. రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేందర్ కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ మీద తీసుకెళ్తూ అత్తను చంపిన అల్లుడు

**బలగం టీవీ, హైదరాబాద్**



మృతురాలు అరుణ



నిందితుడు స్నేహిత్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. బైక్ పై అత్తను కూర్చుబెట్టుకుని వెళ్తున్న అల్లుడు హెల్మెట్‌తో దాడి చేసి ఆమెను చంపాడు. వివరాల్లోకెళ్తే.. మేడిపల్లి పరిధిలోని చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీలో నివసించే కర్రు కావ్య, కరీంనగర్ జిల్లా చందన్‌పూర్‌కు చెందిన కర్రు స్నేహిత్‌ను ఏడాది క్రితం ప్రేమవివాహం చేసుకుంది. గత నెల 28న కావ్య తల్లి కొల్లా అరుణ (39) తన కుమార్తెను ఇంటికి పిలిపించుకుంది. అదే రోజు రాత్రి స్నేహిత్ పలుమార్లు అత్త అరుణకు ఫోన్ చేసి, కుమార్తె ప్రవర్తనపై అసభ్యంగా మాట్లాడినట్టుగా కుటుంబ సభ్యులు తెలిపారు. మరుసటి రోజు (ఏప్రిల్ 29) మధ్యాహ్నం అరుణ బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, స్నేహిత్ అక్కడకు చేరి ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం బలవంతంగా బైక్‌పై ఎక్కించి తీసుకెళ్లాడు. కొద్దిసేపటికే అరుణకు ఫిట్స్ వచ్చి బైక్ పై నుంచి పడిపోయిందని, దగ్గరలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లి, తరువాత మెరుగైన చికిత్స కోసం బోడుప్పల్‌లోని ఆర్‌బీఎం ఆస్పత్రికి తరలించామని స్నేహిత్ తన భార్యకు ఫోన్‌లో తెలిపాడు. అయితే అతని భార్యకు అనుమానం వచ్చి పరిసర ప్రాంతాల సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా బైక్‌పై వెళ్తున్న సమయంలో స్నేహిత్ తన అత్త అరుణతో వాగ్వాదానికి దిగినట్టు కనిపించింది. ఆ తరువాత ఆవేశంతో హెల్మెట్‌తో ఆమె తలపై దాడి చేయడంతో రోడ్డుపై పడిపోయిన దశ్యాలు రికార్డు అయ్యాయి. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన అరుణ చికిత్స పొందుతూ ఏప్రిల్ 30న సాయంత్రం మరణించింది. దీంతో మతురాలి కుమార్తె తన భర్తపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



# వివాహమైన రెండు నెలల్లోనే నవదంపతుల ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

వివాహమై రెండు నెలలు కూడా గడవక ముందే నవదంపతులు ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ప్రేమించి, పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న జంట అనూహ్యంగా మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.

కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో కే.వి. సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి గ్రామానికి చెందిన కార్తీక్, మంజుల (గ్యాంసిక) గత మార్చి 8న వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహమే అయినప్పటికీ కుటుంబ సభ్యుల సమ్మతితో పెళ్లి జరిగింది. శనివారం వారు నివసిస్తున్న ఇంట్లో కార్తీక్ ఉరివేసుకుని కనిపించగా, మంజుల నోటి నుంచి నురగలు వస్తూ అపస్మారక స్థితిలో పడిఉండటంతో కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. పెళ్లైన నెల రోజులకే ఈ దారుణ ఘటనకు దారితీసిన కారణాలపై స్పష్టత రావాల్సి ఉందని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# బతుకమ్మకుంట చెరువే

- **హైకోర్టు ఆదేశాలను పాటిస్తాం**
- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

**బలగం టీవీ, హైదరాబాద్**




అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువేనని, రెవెన్యూ, సర్వేఆఫ్ ఇండియా, నాసా అన్ని మ్యాప్‌లు, రికార్డులు సైతం ఇదే స్పష్టం చేస్తోందని హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ తెలిపారు. బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్టు ఎడ్ల సుధాకర్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ అంశం తాజాగా పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. ప్రజల్లో అయోమయం సృష్టిస్తోంది. దీనిపై హైడ్రా కమిషనర్ స్పందించారు. శనివారం బుద్ధభవన్‌లోని హైడ్రాకార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన కమిషనర్ చెరువుల అభివృద్ధి, హైడ్రా పనితీరు, వస్తున్న ఫిర్యాదులపై ఎలాముందుకు వెళ్తున్నారో వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అంబర్‌పేట బతుకమ్మ కుంటను హైడ్రా అభివద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని, రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందన్నారు. బతుకమ్మ కుంట అభివద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని, కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటున్నారని, కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే అక్కడ 10ఎకరాల చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. ఆ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదన్నారు. అసలు చెరువులో ఉన్న భూమికి పట్టాలు ఎలా వస్తాయని కమిషనర్ ప్రశ్నించారు. కొన్ని సందర్భాలల్లో చెరువులో వ్యవసాయం చేయొచ్చని, అంతమాత్రానా చెరువుకు యజమాని అయిపోరన్నారు. చెరువులు, నీటివనరులు ప్రజల సొత్తన్నారు. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. వరదల నివారణకు చర్యలు తీసుకునేందుకు హైకోర్టు తమకు అనుమతి ఇచ్చిందన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని స్పష్టం చేశారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని, సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తున్నట్టు వెల్లడించారు. ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ దాదాపుగా రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందన్నారు. హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలన్నారు. హైడ్రాలో 30వేల పిటిషన్లు ఉన్నాయని, అయితే 50 మంది అధికారులు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నగరంలో మరిన్ని చెరువులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. తప్పుచేసిన అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలని రిపోర్టులు పంపిస్తున్నామని, ఇప్పటివరకు దాదాపు 50మంది అధికారులపై విజిలెన్స్, ఏసీబీతోపాటు సంబంధిత శాఖలకు లేఖలు రాశామన్నారు. కొందరు భూకబ్జాదారులు హైడ్రాపై పథకం ప్రకారం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పేదలను ముందుపెట్టి సెంటిమెంట్‌ను రాజేస్తున్నారని ‘ఐలాపూర్‌తోపాటు ఇతర ప్రాంతాలల్లో ఇదే జరిగిందన్నారు. హైడ్రా పేదల ఇండ్లజోలికి వెళ్లదన్నారు. తప్పుడు ప్రచారాలను మీడియా ప్రతినిధులు, ప్రజలు గమనించాలన్నారు.

# ప్రియుడు ఫోన్ రీఛార్జ్ చేయించలేదని యువతి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రియుడు తన మొబైల్‌కు రీఛార్జ్ చేయించలేదని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ ప్రశాంత్ నగర్‌లో నివాసం ఉంటున్న కిర్మణయి (26) 2015లో సురేష్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. దంపతుల మధ్య విభేదాలు రావడంతో భర్తతో విడిపోయింది. దంపతులకు ఒక కుమారుడు ఉండగా అతను కిరణ్మయి తల్లి వద్ద ఉంటున్నాడు. ఇదిలా ఉంటే నాలుగేండ్ల క్రితం కిరణ్మయి కూకట్‌పల్లిలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంది. ప్రస్తుతం ఓ ప్రయివేటు సంస్థలో పనిచేస్తోంది. కంపెనీలో పనిచేస్తున్న సమయంలో ఆమెకు వెంకటేశ్ అలియాస్ చందూ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అది కాస్త చనువుగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేసే స్థాయికి వచ్చారు. ఇద్దరూ ఏడాది నుంచి ప్రశాంత్ నగర్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆమె ఫోన్ రీచార్జ్ అయిపోయింది. ఆమెకు ఇంకా జీతం రాకపోవడంతో రీచార్జ్ చేసుకోలేకపోయింది. దాంతో వెంకటేశ్‌ను అడిగినప్పటికీ రీచార్జ్ చేయించలేదు. ఇదే విషయమై శుక్రవారం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపం చెందిన కిరణ్మయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వెంకటేష్ పై మతురాలి తల్లి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ఫోన్ రీచార్జ్ కారణమా..? లేక ఇతర సమస్యలు ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లపై సైబర్ క్రైమ్ పోలీసుల ఉక్కుపాదం

**184 సోషల్ మీడియా ప్రొఫైల్స్ తొలగింపు**

**బలగం టీవీ, హైదరాబాద్**

అమాయకులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరస్తులు వారిని బెట్టింగ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ వైపు ఆకర్షిస్తున్నారు. మాయమాటలతో నిత్యం మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. సైబర్‌క్రైమ్ ప్రొఫైల్స్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆపరేషన్ చేపట్టిన పోలీసులు అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ప్రమోషన్లు, నకిలీ పెట్టుబడి పథకాలను అరికట్టడంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గణనీయమైన విజయాన్ని సాధించారు. నిరంతర డిజిటల్ పర్యవేక్షణ, ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాకింగ్ ద్వారా గత ఏప్రిల్ నెలలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ యూనిట్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో 184 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను గుర్తించింది. ఇవి భారతీయ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని వివిధ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ అప్లికేషన్లు, నకిలీ పెట్టుబడి వెబ్‌సైట్‌లను ప్రోత్సహిస్తూ 801 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను నడుపుతున్నాయని ఆధారుల సేకరించారు. ఈ ప్రకటనలు సులభంగా డబ్బు సంపాదించవచ్చని, బోనస్‌లు, రెఫరల్ కమీషన్లు, పెట్టుబడులపై భారీ లాభాలు వస్తాయని నమ్మబలికి అమాయకులను ఆకర్షించేలా రూపొందించారని తేలింది.

మాయమాటలతో అమాయకులనే కాదు బాగా చదువుకున్న వారిని సైతం సైబర్ నేరస్తులు మోసాలకు గురి చేస్తున్నారు. కూర్చున్నచోటే లక్షలు సంపాదిస్తున్నారు. స్పందించిన వారి నుంచి సేకరించిన ప్రొఫైల్స్ ద్వారా ప్రచార కంటెంట్, రెఫరల్ లింకులు, ఐపీఎల్ మ్యాచ్‌ల అంచనాలు, ప్రముఖ వ్యక్తుల ‘డీప్‌ఫేక్’ వీడియోలను ప్రదర్శించి వారికి గాలం వేస్తున్నారు. అక్రమ బెట్టింగ్‌లు, పెట్టుబడి పథకాల వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. సైబర్ క్రైమ్‌పై ఆరా తీసిన పోలీసులు మొత్తం 184 ప్రొఫైల్స్‌ను గుర్తించారు. అక్రమ సమాచారం వ్యాప్తి చెందకుండా వాటిని తొలగించారు. నిబంధనల ఉల్లంఘించిన వారిపై ఏప్రిల్ నెలలో 06 ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు చేశారు. ఇప్పటి వరకు మొత్తం 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌తోపాటు 1903 పెయిడ్ ప్రమోషనల్ అడ్వర్టైజ్‌మెంట్లను గుర్తించిన సైబర్‌క్రైమ్ పోలీసులు వాటిని తొలగించారు.

తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జూదం నిషేధించినట్టు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. సులభంగా అధిక లాభాలు, బోనస్‌లు వస్తాయని నమ్మిస్తారని వాటిని నమ్మొద్దని సూచించారు. వాటిని నమ్మి క్లిక్ చేస్తే మీ వ్యక్తిగత డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే ఎలాంటి లింకులను క్లిక్ చేసినా, వాటని ప్రోత్సహించడం లేదా షేర్ చేసినా చట్టరీత్యా నేరమని తెలిపారు. అనధికార ఆన్‌లైన్ బెట్టింగ్ లేదా గ్యాంబ్లింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిలో వివరాలను షేర్ చేయొద్దన్నారు. ప్రముఖ వ్యక్తులు పెట్టుబడి పథకాలను ప్రోత్సహిస్తున్నట్లు వచ్చే డీప్‌ఫేక్ వీడియోలను నమ్మొద్దన్నారు. అనుమానాస్పద ప్రకటనలు లేదా లింకులు కనిపిస్తే వెంటనే సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో లేదా అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలు గమనించినట్టయితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్నారు.



# బీసీ జనగణ ప్రకటించాకే ప్రధాని సభ నిర్వహించాలి

**లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలు**

**అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో బీసీ సంఘాల నేతల హెచ్చరిక**

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశవ్యాప్తంగా జనగణనలో బీసీ కులగణన చేపడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, బీసీ జనగణపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ సభ నిర్వహించాలని బీసీ సంఘాలు, అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 10న ప్రధాని రాష్ట్ర పర్యటన సందర్భంగా తెలంగాణవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, టీజేఎస్, సీపీఎం నేతలతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బిహార్ ఎన్నికల ముందు దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపడతామని ప్రకటించిన ప్రధాని, ఎన్నికల అనంతరం మాట మార్చడం బీసీలను మోసం చేయడమేనని నేతలు విమర్శించారు. బీసీల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు పెంపు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా, పార్లమెంట్‌లో బీసీ హక్కుల పరిరక్షణ వంటి కీలక అంశాలపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళా బిల్లులో అన్ని వర్గాల మహిళలకు సమన్యాయం జరగాలని, బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని కేంద్రం ఆమోదించకుండా అవమానించిందని, ఇప్పుడు కులగణన విషయంలోనూ మోసం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు చేపట్టే నిరసనలకు టీజేఎస్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లు, సామాజిక న్యాయంపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. ప్రధాని తెలంగాణ పర్యటనకు ముందే సమగ్ర కులగణనపై ప్రకటన చేయాలని, బీసీ సంఘాలు చేపట్టే ప్రతి నిరసనకు సీపీఎం మద్దతుగా నిలుస్తుందని ప్రకటించారు. వీహెచ్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో బీసీలకు న్యాయం జరగలేదని, బీసీల హక్కుల కోసం చివరి వరకు పోరాడతానని స్పష్టం చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలోని 70 కోట్ల బీసీల ఆకాంక్షలను బీజేపీ పట్టించుకోవడం లేదని, బీసీ కులగణన, రిజర్వేషన్ల పెంపు, మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉప కోటా వంటి డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రధాని పర్యటన రోజున రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, బీసీ, విద్యార్థి, మహిళా, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# నల్లచెరువు పార్క్ వద్ద శిలాఫలకం తొలగింపు

**ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎమ్మెల్యే ఫిర్యాదులతో వెనక్కి తగ్గిన హైడ్రా**

**బలగం టీవీ, హైదరాబాద్**

కూకట్‌పల్లిలోని నల్లచెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రారంభోత్సవ శిలాఫలకం ప్రోటోకాల్ వివాదం నేపథ్యంలో తొలగించబడింది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన నల్లచెరువు అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం హైడ్రా ఆధ్వర్యంలో పూర్తి చేయగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. అయితే కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై ఎలాంటి అధికార హోదా లేని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి రమేష్ పేరును చేర్చడం వివాదాస్పదమైంది. ఈ అంశాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రంగా వ్యతిరేకిస్తూ గత అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా స్థాయిలో ప్రోటోకాల్ ప్రకారం ప్రాధాన్యం కలిగిన ఎమ్మెల్సీలను పక్కనబెట్టి, పదవి లేని వ్యక్తి పేరును శిలాఫలకంపై చేర్చడం నిబంధనల ఉల్లంఘన అని ఆయన మండిపడ్డారు.

ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రోటోకాల్ ఉల్లంఘన ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో హైడ్రా అధికారులు వెనక్కి తగ్గి, నల్లచెరువు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని అక్కడి నుంచి తొలగించారు.

ఇటీవల హైడ్రాపై వివిధ ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్న తరుణంలో ఈ ఘటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. హైదరాబాద్‌లో అభివృద్ధి చేసిన చెరువుల విషయంలో హైడ్రాకు వరుసగా వివాదాలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు.

# మోడీ సభ తెలంగాణలో రాజకీయ మార్పునకు నాంది

**జన ఆగ్రహ సభ విజయవంతం చేయాలి: కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రధాని నరేంద్ర మోదీ మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో పాల్గొననున్న జన ఆగ్రహ సభ తెలంగాణ రాజకీయాల్లో మార్పుకు నాంది పలుకుతుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం నాగోల్ డివిజన్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ప్రజాభిమానాన్ని మోదీ సభ మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని బలపరచాలని, దేశ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రధాని మోదీ దేశాన్ని అగ్రస్థానానికి తీసుకెళ్తున్నారని అన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ దేశంలో అత్యంత ప్రజాస్వామికమైన పార్టీ అని పేర్కొన్నారు. ప్రాంతీయ పార్టీల్లో కుటుంబ పాలన కొనసాగుతుండగా బీజేపీ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే జాతీయ పార్టీగా నిలుస్తోందన్నారు. భారతదేశాన్ని ప్రపంచ అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, తెలంగాణలో కూడా బీజేపీ బలపడేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాగోల్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, ఎల్బీనగర్ పరిధిలోని వివిధ డివిజన్ల నాయకులు, మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి పదాధికారులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రంలో అదనపు కలెక్టర్ పరిశీలన

**బలగం టీవీ, గంభీరావుపేట:**

గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, వసతులు పరిశీలించి.. పలు సూచనలు చేశారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది అని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. అనంతరం గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ లోని శ్రీ సాయి ఇండస్ట్రీస్ మిల్లులో అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతి ఇతర అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంట వెంటనే దించుకొని లారీలు పంపాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్లు మారుతి రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# శుభకార్యాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పెరుంబుదూర్ వినోద్ -- మాధవీలత దంపతుల కుమార్తె రష్మీ వివాహానికి మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సి సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. శుక్రవారం కరీంనగర్లోని సత్యరత్నం గార్డెన్లో జరిగిన ఈ వివాహానికి హాజరై యువతను వధూవరులను ఆశీర్వదించారు.

సీతారాంపూర్ లో... కరీంనగర్ మండలం సీతారాంపూర్ కాలనీలోని ఈ.ఎన్ గార్డెన్స్ లో గట్టు దుద్దెనపల్లి మాజీ సర్పంచ్ పెంచాల వసంత -- రాజయ్య కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే సీతారాంపూర్ లోని రెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగిన మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన ముదిగంటి మంజుల -- జీవన్ రెడ్డి కూతురు వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పొత్తూరు లో... ఇల్లంతకుంట పొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

గాలిపెల్లిలో... ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలోని సామ ఏ.ఎస్.ఆర్ గార్డెన్స్ లో జంగపల్లి గ్రామానికి చెందిన తాడూరి లలిత- ధర్మారెడ్డి కుమారుని వివాహానికి మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.

చిక్కుడువానిపల్లిలో... ఇల్లంతకుంట మండలం చిక్కుడువానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



# ప్రశ్నిస్తే సంకెళ్లా..? అభివృద్ధిని అడిగితే జైల్లా..?

**-- బోయినిపల్లిలో కాంగ్రెస్ 'కక్షసాధింపు' రాజకీయాలు**

**-- అక్రమ కేసులకు భయపడం.. వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..**

**-- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలు హద్దులు దాటుతున్నాయని, అభివృద్ధిని అడిగితే జైలుకు పంపే 'రాక్షస పాలన' సాగుతోందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు.. ప్రజా సమస్యలపై గొంతు ఎత్తినందుకు బిఆర్ఎస్ నాయకుడు అక్కెనపల్లి కరుణాకర్‌పై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జైలు నుండి విడుదలైన కరుణాకర్‌ను రవిశంకర్ పరామర్శించినారు.

ఈ సందర్భంగా రవి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా బోయినిపల్లి మండలంలో ఇటుక మీద ఇటుక వేయలేదు. బిఆర్ఎస్ హయాంలో మంజూరైన స్తంభంపల్లి గంజి వాగు బ్రిడ్జి పనులను పక్కనపెట్టినారని,మాజీ సర్పంచ్‌ల బిల్లులను ఆపేసి వేధిస్తున్నారు అని అన్నారు . ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తున్నందుకే స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఓర్వలేక, పోలీసులను అడ్డుపెట్టుకుని కక్షసాధింపు రాజకీయాలకు తెరలేపారని ఆరోపించారు.

దళిత రత్న అవార్డు పొందిన కరుణాకర్‌ను సోషల్ మీడియాలో అవమానించడమే కాకుండా, తిరిగి ఆయనపైనే కుట్రపూరితంగా కేసులు పెట్టడం దుర్మార్గమని అన్నారు . ఎమ్మెల్యే అండదండలతోనే ఫోర్జరీ మెడికల్ సర్టిఫికెట్లు సృష్టించి, ఒక దళిత బిడ్డను జైలు పాలు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాకీలు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని అన్నారు. అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడే వాడెవడూ బిఆర్ఎస్‌లో లేడు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల కోసం మా పోరాటం ఆగదుఅని అన్నారు. ఇప్పుడు అరాచకాలు సాగిస్తున్న నాయకులకు కాలం దగ్గర పడిందని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు ప్రతి అన్యాయానికి వడ్డీతో సహా చెల్లిస్తామని అన్నారు.

ఇక్కడ బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, నాయకులు గంటి శంకర్, కొంకటి శేఖర్, మెడుదుల మల్లేశం, కమల్ గౌడ్, బాపురెడ్డి, కొప్పుల మల్లేశం, బోయిని రాజు, తుంటి మధు, జగన్ గౌడ్, దుస మధు, రాజేశం, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛ... సమాజం ఊపిరి..

**- ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు**

**- మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పత్తిపాటి మంజుల**

**బలగం టీవీ, ఆలేరు:**

ప్రతీ పత్రికా కలం ఒక దీపమై చీకట్లను చెదిరకొట్టింది..!
ప్రతీ కలం కాగితం మీద అక్షరాలుగా మారి ప్రపంచానికి వెలుగు చూపింది..!
ఒక వార్త వెనుక రాత్రి పగలు తేడా లేకుండా నడుస్తున్న విలేకరి అడుగుల బాధను చూడరా..!
ఎండ వానల ఆటుపోటులను తట్టుకోంట్టు పయనం చేస్తూ...
బెదిరింపుల ముల్లులను లేక్కచేయక
మన దేశం కోసం మన కోసం నడుస్తున్న పత్రికా అడుగుల బాధను చూడరా..!
నిజం కోసం పత్రికా కలం నుంచి జాలువారిన అక్షరం చినుకు పెను తుపానై అధికారాలు కదలేలా చేస్తుంది..!
మనం తీసుకునే స్వచ్ఛమైన గాలి కోసం ఎన్నో త్యాగాలు చేస్తూ..
అణచివేత గాలులు ఎన్ని వీచినా
ప్రజాస్వామ్యానికి పత్రికా కంచుకోటై
నిలుస్తుంది..!
ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ మే 03 శుభాకాంక్షలు

రచన: పత్తిపాటి మంజుల
మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆలేరు యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.



# మల్రిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మల్రిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశించారు . శనివారం వేములవాడ రూరల్ మండలం మల్రిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మల్రిపల్లి ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ , నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా పెంచాలని అధికారులకు మరియు సంబంధిత కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ఆనాడు 1737 కోట్లతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కు అంకురార్పణ చేశారని అన్నారు..ఆ ప్రాజెక్ట్ ద్వారా అందుతున్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా అనుసంధాన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం జరుగుతోందన్నారు...

మల్రిపల్లి ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత కుడి, ఎడమ కాల్వల ద్వారా సుమారు 3,600 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మల్లారం, నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి, కొనయపల్లి, కాశయ్యపల్లి, ఎదురు గట్ల, చెక్కపల్లి, అచ్చన్నపేట, వెంకటంపల్లి, బాలరాజపల్లి తదితర గ్రామాలకు ప్రత్యక్ష, పరోక్ష లాభాలు చేకూరుతాయని అన్నారు .భూసేకరణకు సంబంధించిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం నిధులు సిద్ధంగా ఉన్నాయని,



వాటిని త్వరగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి**

వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఎకరానికి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు . నంది మేడారం పంపుల ద్వారా నీటి సరఫరాను మరింత మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

కలిగోట సూరమ్మ ప్రాజెక్ట్, లచ్చపేట రిజర్వాయర్, ఎర్రచెరువు పటేల్ చెరువుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేసి రైతులకు నీరు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మల్రిపల్లిలో రైతు వేదిక, గోదాముల నిర్మాణానికి భూమి కేటాయించి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.కాంట్రాక్టర్లు నాణ్యతతో కూడిన పనులు వేగంగా పూర్తి చేయాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలు సహకరించాలని విప్ కోరారు..ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం..

**-భావితరాల భవిష్యత్తును కాపాడదాం..**

**- ఎస్పీ మహేష్ బి. గితే.**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

డ్రగ్స్ అనే మహమ్మారిని సమాజం నుండి పూర్తిగా తరిమికొట్టి, భావితరాలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందిద్దామని ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 2ఖ రన్‌లో విద్యార్థులు, క్రీడాకారుల తో కలసి ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే. మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలన కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తుకు బానిస కాకుండా, పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ వాడకం వల్ల కేవలం ఆరోగ్యం మాత్రమే కాకుండా, మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతింటాయని, ఇది మానసిక సమస్యలకు మరియు సామాజిక రుగ్మతలకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి విద్యార్థి ఒక లి'యాంటీ డ్రగ్ సోల్జర్'లిగా మారి, సమాజంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల సరఫరా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నంబర్ 8712671111 కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అన్నారు .

అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, వారి తల్లిదండ్రులపై మరియు వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు .?అనంతరం విద్యార్థులు మరియు క్రీడాకారులతో ఎస్పీ డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎస్ఐ శ్రీకాంత్, డీసీపీఓ కవిత, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు, పోలీసు సిబ్బంది మరియు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



# పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

**బలగం, బోయినిపల్లి;**

రైతుల కేవలం ఒకే పంటను అదే పొలంలో వానాకాలం మరియు యాసంగికాలంలో సాగు చేస్తే భూసారం క్షీణించడంతో పాటు దిగుబడులు తగ్గి ఆదాయం తగ్గిపోతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రామన్నపేట రైతులకు సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ జె.సురేష్, డాక్టర్ శ్రీజ,మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత లు పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: పంట మార్పిడి వలన నేల ఆరోగ్యం భూసారం పెరుగుతుందని తద్వారా దిగుబడులు పెరిగి అధిక ఆదాయం పొందవచ్చుని .వరి పంట తర్వాత జీరో టిల్లెజ్ పద్ధతి మొక్కజొన్న, పెసర, మినుము పంటలు లాభదాయకమని తెలిపారు. నీటి వనరులను పొదుపుగా వాడుకొవాలని తెలిపారు. అవసరమైన మేరకు రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీదేవి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు అనిల్, శ్రీధర్, గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్పింగ్ కార్మికుల కూలీ పెంచాలి

**- రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా**

**- సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వార్పింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, కూలీ పెంపును వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. ?ప్రస్తుతం కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఎగమంటి ఎల్లారెడ్డి సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. మే 4వ తేదీ సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.యజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మెజారిటీ యజమానులు కూలీ పెంచడానికి అభ్యంతరం చెప్పకపోయినప్పటికీ, కొంతమంది పెద్ద యజమానులు కావాలనే అడ్డంకులు సృష్టిస్తూ సమ్మెను పొడిగిస్తున్నారని మండిపడ్డారు. చర్చల సమయంలో కార్మికులు కొంతమేర పట్టువిడిచినప్పటికీ, యజమానులు మాత్రం ఇంకా తక్కువ కూలీ ఇస్తామని మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు.?యజమానులు వెంటనే దిగిరాకపోతే సిఐటియు అనుబంధ సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సిరిమల సత్యం, గౌరవాధ్యక్షులు ఉడుత రవి, నాయకులు మచ్చ వేణు, ఐరన్ ప్రవీణ్, సామల నరసయ్య, సామల శ్రీనివాస్, బూట్ల వెంకటేశ్వర్లు, కూరపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలనతో గడప గడపకూ సంక్షేమ ఫలాలు..

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, వేములవాడ:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేరుస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడలో నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ నియోజకవర్గ స్థాయి సభకి ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గ్రామ, మండల సభల ద్వారా ప్రజల నుంచి అందిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి కీలక నిర్ణయాలను అమలు చేస్తున్నామని అన్నారు .

?విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని,200 కోట్ల రూపాయలతో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని, భవిష్యత్తులో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహాలోనే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని అన్నారు . వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి 150 కోట్ల రూపాయలు కేటాయించామని, పట్టణ ప్రజల కోరిక మేరకు రోడ్డు వెడల్పు పనులను చేపడుతున్నామని అన్నారు . వీటితో పాటు సాగునీటి ప్రాజెక్టులైన కలికోట సూరమ్మ, మల్కపేట రిజర్వాయర్, మల్రిపల్లి పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీటి భరోసా కల్పిస్తామని అన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, జూన్ 12వ తేదీ వరకు 10 ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, సోషల్ మీడియా వంటి వ్యాపకాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో రైతు భరోసా కింద 67,810 మంది రైతులకు, రుణమాఫీ ద్వారా 18,488 మందికి భారీగా లబ్ధి చేకూరిందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను సందర్శించి ప్రదర్శనలను తిలకించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకుల తిరుపతి, కచ్చుకాయల ఎల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ రాధాభాయ్, సీపీఓ శ్రీనివాసాచారి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతోనే జిల్లా ప్రగతి పథం..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.

శనివారం సిరిసిల్లలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సభకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' వీడియో ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన ప్రత్యేక వీడియోను ఆవిష్కరణ అందరినీ ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో సంక్షేమ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఇప్పటికే గ్రామ మరియు మండల స్థాయిల్లో సభలు నిర్వహించి ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. పారిశుధ్యం, ఆరోగ్యం, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రత్యేక వారోత్సవాలు నిర్వహించడమే కాకుండా, వాహన చోదకులకు కంటి పరీక్షలు మరియు ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు మరియు వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు మరియు టీబీ ముక్త్ భారత్ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇప్పటికే 1,968 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మిగిలిన లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో మార్పులు రావాలని, రైతులు సన్న వడ్లు మరియు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లాలని, వారికి ఉద్యానవన శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ఇంటి నిర్మాణ రుణాలు మరియు ఇతర ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని, ఇందుకోసం ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గ్రామాల్లో రోడ్ సేఫ్టీ కమిటీలు బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని, మైనర్ డ్రైవింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ఉల్లంఘనలపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. అనంతరం నేతన్నలకు భద్రత చెక్కులు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు వీల్ చైర్లు మరియు విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్ ఇన్సినేటర్లను పంపిణీ చేశారు. రైతు భరోసా, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాల ద్వారా వేలాది మంది లబ్ధిదారులకు కోట్లాది రూపాయల ప్రయోజనం చేకూరిందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్మన్లు సబేరా బేగం, తలారి రాణి, రాములు, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతో మా వార్డుకు నీళ్లు, అభివృద్ధి నిలిపివేత

- ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట

**వార్డు సభ్యురాలి నిరసన**

**బలగం టీవీ, ముస్తాబాద్**

రాజకీయ కక్షతో తమ వార్డులో తాగునీటి సరఫరాతో పాటు అభివృద్ధి పనులను సర్పంచ్ అడ్డుకుంటున్నాడని ఆరోపిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో మహిళా వార్డు సభ్యురాలు ఖాళీ బిందెలతో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టింది. ముస్తాబాద్ పట్టణంలోని 9వ వార్డుకు చెందిన వార్డు సభ్యురాలు బండి సుమలత స్థానిక మహిళలతో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని బైఠాయించి ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గ్రామసభలో తమ వార్డులోని బోరుబావికి కొత్త మోటారు అమర్చి నీటి సరఫరా పునరుద్ధరించామని సర్పంచ్ ప్రకటించారని, కానీ వాస్తవానికి ఎలాంటి మోటారు బిగించకుండా కేవలం లెక్కల్లో మాత్రమే చూపించారని ఆరోపించారు. అలాగే తమ వార్డుకు పంపించిన వాటర్ ట్యాంకర్‌ను సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి తిరిగి పంపించడంతో కాలనీ ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాము కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు సభ్యురాలిని కావడంతో రాజకీయ కక్షతోనే తమ ప్రాంతంపై వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ అధికారులు కూడా సర్పంచ్ మాటనే విని తమ వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆమె ఆరోపించారు. ప్రజలకు కనీస వసతులు కల్పించాల్సిన స్థానిక సంస్థలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలని డిమాండ్ చేశారు.

ఈ వ్యవహారంపై గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా, బోరుమోటారు బిగించలేదని, గ్రామపంచాయతీలో ఉన్న మోటార్లను ఇతర అవసరాల కోసం పక్కన పెట్టామని సమాధానం ఇవ్వడంతో వార్డు సభ్యురాలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డుకు తక్షణమే తాగునీటి సరఫరా పునరుద్ధరించి అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

# సింగర్ మంగ్లీని కావాలనే టార్గెట్ చేస్తున్నారు

- సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్

**బలగం టీవి, హైదరాబాద్**

కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ వ్యూస్ కోసం ప్రముఖ గాయని మంగ్లీపై అసత్యాలు, అసభ్యకర వ్యాఖ్యలతో దుష్ప్రచారం చేస్తూ ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నాయని సేవాలాల్ బంజారా సంఘం అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ ఆరోపించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన బిడ్డగా ఎదిగిన మంగ్లీ విజయాన్ని ఓర్వలేక కొందరు కావాలనే అపప్రథలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మంగ్లీతో పాటు ఆమె కుటుంబాన్ని కూడా వివాదాల్లోకి లాగుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రముఖత కోసం కొందరు పథకం ప్రకారం మీడియా ముందుకు వచ్చి మంగ్లీ ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం విషయం పోలీసు దర్యాప్తులో ఉన్నందున నిజాలు వెలుగులోకి వస్తాయని, ఎవరైనా ఆరోపణలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధమని పేర్కొన్నారు. మంగ్లీపై అనవసర దూషణలు, అసత్య ప్రచారం కొనసాగితే బంజారా సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని బంజారా సమాజం మంగ్లీకి అండగా



నిలుస్తుందని స్పష్టం చేశారు. మైక్రో ఫైనాన్స్ వ్యవహారంపై వాస్తవాలు వెలికి తీయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డీజీపీ చొరవ తీసుకుని సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు పేరుతో భూముల స్వాధీనం అన్యాయం




- భూముల కోసం గ్రామం నుంచి ఢిల్లీ వరకు పోరాటం
- బట్లచంద్రారం రైతుల ఆవేదన..


**బలగం టీవి, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు రోడ్డు పేరుతో తమ భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని దోమ మండలం బట్లచంద్రారం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులతో కలిసి శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలోని సుమారు 235 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. దశాబ్దాలుగా వారసత్వంగా సాగు చేస్తున్న ఈ భూములే తమ కుటుంబాలకు జీవనాధారమని తెలిపారు. ప్రభుత్వం అధికార దర్పంతో రైతుల భూములను బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నిస్తే సహించబోమని హెచ్చరించారు. తమ హక్కుల కోసం గ్రామం నుంచి ఢిల్లీ వరకు పోరాడతామని, అవసరమైతే గాంధీభవన్, సచివాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు కూడా పిలుపునిస్తామని పేర్కొన్నారు.

రైతు మొగిలయ్య మాట్లాడుతూ, తమ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములకు ఎకరానికి రూ.25 లక్షల పరిహారం ప్రకటించడం అన్యాయమని, ప్రస్తుతం మార్కెట్ విలువ కోట్లలో ఉందన్నారు. రైతు బాలయ్య మాట్లాడుతూ, గ్రామానికి రోడ్డు వస్తుందని మొదట సంతోషించామని, కానీ ఇప్పుడు అదే పేరుతో భూములు కోల్పోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. భూముల స్వాధీనం ప్రక్రియలో అభ్యంతరం వ్యక్తం చేస్తే అరెస్టులు చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని రైతులు ఆరోపించారు. రైతుల జీవనాధారాన్ని కాపాడాలని, భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని వారు డిమాండ్ చేశారు.

# తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, అంటు వ్యాధుల సంరక్షణపై "ఇన్సీకాన్-2026" జాతీయ సదస్సు



**పాల్గొన్న 500 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులు**

**బలగం టీవి, హైదరాబాద్**

సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇన్ఫెక్షస్ డిసీజెస్ విభాగం నిర్వహణలో "అంటు వ్యాధులు మరియు క్లిష్టమైన సంరక్షణ" అంశంపై "ఇన్సీకాన్-2026" జాతీయ స్థాయి శాస్త్రీయ సదస్సు శనివారం హైదరాబాద్ హైటెక్ సిటీ రాహేజా మైండ్స్పేస్ ఐటీ పార్క్‌లోని వెస్టిన్ హోటల్‌లో ఘనంగా ప్రారంభమైంది. క్లినికల్ ఇన్ఫెక్షస్ డిసీజెస్ సొసైటీ (జక్మీజా), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ మైక్రోబయాలజిస్ట్స్ (క్మీగావీవీ), అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా (ఇూక్మీ) హైదరాబాద్ చాప్టర్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సులో 500 మందికి పైగా దేశ విదేశాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో అకాడమిక్ ప్రావీణ్యం, నిరంతర వైద్య విద్యాభివృద్ధికి యశోద హాస్పిటల్స్ కట్టుబడి ఉన్నదని తెలిపారు. మాలిక్యులర్ డయాగ్నోస్టిక్స్, ఆధునిక నిర్ధారణ పద్ధతులు, క్లినికల్ విశ్లేషణలు, నూతన చికిత్సా విధానాలపై నిపుణుల అనుభవాలు ఈ సదస్సు ద్వారా వైద్యులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. క్రిటికల్ కేర్, ట్రాపికల్ ఇన్ఫెక్షన్లు, ట్రాన్స్‌ప్లాంట్ సంబంధిత ఇన్ఫెక్షన్లు, హెచ్ఐవీ, టిబి, క్యాన్సర్ చికిత్సలో ఇన్ఫెక్షన్లు, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, టీకాలు, నివారణ చర్యలు వంటి విభిన్న అంశాలపై చర్చలు జరుగనున్నాయని వివరించారు.

యశోద హాస్పిటల్స్ సీనియర్ ఇన్ఫెక్షస్ డిసీజెస్ స్పెషలిస్ట్ డాక్టర్ మోనాలిసా సాహూ మాట్లాడుతూ, ఆధునిక వైద్యంలో ఇన్ఫెక్షస్ డిసీజెస్ విభాగం వేగంగా మారుతున్న కీలక రంగమని అన్నారు. ఐసీయూ ఇన్ఫెక్షన్లు, సెప్సిస్, ఫంగల్ వ్యాధులు, పిల్లల అంటువ్యాధులు, ఇమ్యూనోకాంప్రమైజ్డ్ రోగుల నిర్వహణపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడంలో ఈ సదస్సు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య, యూనిట్ హెడ్ డాక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు ప్రధాన సమన్వయకర్తగా డాక్టర్ మోనాలిసా సాహూ వ్యవహరించారు.



## నకిరేకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఎమ్మెల్యే వీరేశం ఆకస్మిక తనిఖీ..

**బలగం టీవీ, నల్గొండ:**

నకిరేకల్ మండలం నోముల, చందుపట్ల గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి కొనుగోలు ప్రక్రియపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నోముల, చందుపట్ల కేంద్రాల నుంచి ఇప్పటికే పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు. లారీల ద్వారా మిల్లర్లకు ధాన్యం తరలింపులో కొంత ఆలస్యం ఉన్నప్పటికీ, కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు సివిల్ సప్లయ్స్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారికి చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. నకిరేకల్ మండలంలో ప్రతిరోజు సుమారు 40 లారీల ద్వారా ధాన్యం తరలింపు జరుగుతోందని వెల్లడించిన ఎమ్మెల్యే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులకు లేదా తనకు నేరుగా తెలియజేయాలని సూచించారు.

## విలేకరి రాజకుమార్ మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి..

**బలగం టీవీ, కరీంనగర్:**

తిమ్మాపూర్ మండల ఈనాడు విలేఖరి బొజ్జ రాజకుమార్ (32) ఆకస్మిక మృతిపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన రాజకుమార్ చాలాకాలంగా ఈనాడు విలేకరిగా పనిచేస్తూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంబంధాలు విస్తృతంగా కలిగి ఉన్న రాజ్ కుమార్ మానేరు డ్యామ్ లోని ఓ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. వృత్తిపరంగా జర్నలిజంలో ఎంతో రాణించాల్సిన రాజ్ కుమార్ అర్ధంతరంగ తనువు చాలించడం విషాదకరమని డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. రాజ్ కుమార్ మృతి పై సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## పెద్దమ్మ తల్లి ఆలయానికి ఉప సర్పంచ్ సీసీ కెమెరాలు వితరణ

**నేరాల నియంత్రణ లో సీసీ కెమెరాల పాత్ర కీలకం**

**సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరావు**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

మండలంలోని రహీమ్ ఖాన్ పేట గ్రామానికి చెందిన ఎర్ర నర్సుపల్లె పెద్దమ్మ గుడి ఆలయానికి ఉప సర్పంచ్ గడ్డమీద పద్మ సుమారు 25వేల రూపాయల సీసీ కెమెరాల సామాగ్రిని ముదిరాజ్ సంఘం సభ్యులకు వితరణ చేయడం జరిగింది, ఈ సందర్భంగా ముదిరాజు సంఘ సభ్యులు ఉప సర్పంచ్ పద్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిది గా స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్, సిరిసిల్ల రూరర్ సీఐ నాగేశ్వరరావులు వచ్చి పెద్దమ్మతల్లి ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభించారు, ఈ సందర్భంగా రూరల్ సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా బాగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని, తల్లితండ్రులు కూడా పిల్లల్ని పరీక్షించాలని తెలిపారు , ఎస్సై అశోక్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమని తెలిపారు , ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కమటం లావణ్య రాములు, ఉప సర్పంచ్ గడ్డమీది పద్మ, బత్తిని మల్లయ్య, కూస రవి, కంకటి ప్రభాకర్, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతిబా పూలే విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే..

**బలగం టీవీ, మానకొండూరు :**

10వ తరగతి పరీక్షలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మానకొండూర్ మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాల విద్యార్థులకు మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ అభినందించారు. తనను కలవడానికి శుక్రవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజా భవన్ కు విచ్చేసిన సదరు విద్యార్థులను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు జ్యోతిబా పూలే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఖతర్‌లో తెలంగాణ గల్ఫ్ సమితికి అంతర్జాతీయ గౌరవం

**తెలుగు కార్మికుల సేవలకు ప్రతిష్టాత్మక అవార్డు..**

**బలగం టీవీ, హైదరాబాద్:**

లేబర్ డే సందర్భంగా ఖతర్ మినిస్ట్రీ ఆఫ్ లేబర్ మరియు వర్కర్స్ సపోర్ట్ ఇన్సూరెన్స్ ఫండ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన "వర్కర్స్ ఇంటర్నేషనల్ డే సెలబ్రేషన్స్" కార్యక్రమంలో ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సంస్థలు పాల్గొని కార్మిక సేవల పట్ల తమ అంకితభావాన్ని ప్రదర్శించాయి.

ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఖతర్‌లో తెలుగు కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ గల్ఫ్ సమితికి అవార్డు లభించడం గర్వకారణంగా నిలిచింది. ఈ అవార్డు కేవలం ఒక సంస్థకు వచ్చిన గౌరవం మాత్రమే కాకుండా, విదేశాల్లో శ్రమిస్తున్న ప్రతి తెలుగు కార్మికుడి కృషికి లభించిన గొప్ప గుర్తింపుగా భావించబడుతోంది. ఈ విజయానికి వెనుక ఎన్నో కనిపించని చేతులు, త్యాగాలు, నిరంతర శ్రమ దాగి ఉన్నాయి. సంస్థ కోసం నిస్వార్థంగా సేవలందించిన ప్రతి సభ్యుడు, వాలంటీర్, మద్దతుదారులకు ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. వారి అంకితభావం, సేవా స్ఫూర్తి, ఐక్యత వల్లే ఈ గౌరవం సాధ్యమైంది. ఈ గౌరవాన్ని ఖతర్‌లో నివసిస్తున్న ప్రతి తెలుగు ప్రజలకు అంకితం చేస్తూ, భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని తెలంగాణ గల్ఫ్ సమితి ప్రతినిధులు తెలిపారు.



## ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్న కేఎల్ రాహుల్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ కేఎల్ రాహుల్ విశ్వరూపం ప్రదర్శించాడు. 226 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఏమాత్రం తడబడకుండా కేవలం 40 బంతుల్లోనే 75 పరుగులు సాధించాడు. తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే ఆయన ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో బాదిన 5 సిక్సర్ల ద్వారా కేఎల్ రాహుల్ ఐపీఎల్ చరిత్రలో ఓపెనర్‌గా 200 సిక్సర్ల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా ఆయన చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు భారత్ నుంచి మరే ఓపెనర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రిస్ గేల్ (326), డేవిడ్ వార్నర్ (210) మాత్రమే రాహుల్ కంటే ముందున్నాడు. ప్రస్తుతం 203 సిక్సర్లతో రాహుల్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.భారత క్రికెట్‌లో అత్యంత నమ్మదగ్గ ఆటగాడిగా గుర్తింపు పొందిన రాహుల్, ఓపెనర్‌గా తనదైన ముద్ర వేశాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో ఓపెనర్‌గా 112 మ్యాచ్‌లు ఆడి 50.1 సగటుతో 4851 పరుగులు సాధించాడు. ఇందులో 6 శతకాలు, 39 అర్ధ శతకాలు ఉండటం విశేషం. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 192 సిక్సర్లతో రాహుల్ వెనుక ఉండగా, రోహిత్ శర్మ కనీసం మొదటి ఐదు స్థానాల్లో కూడా లేకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుత సీజన్ ఆరంభంలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనప్పటికీ, ఆ తర్వాత రాహుల్ తన ఫామ్‌ను అందిపుచ్చుకున్నాడు. ఢిల్లీ తరపున 9 ఇన్నింగ్స్‌ల్లో 185.83 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 433 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్‌పై ఆయన చేసిన 152 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఐపీఎల్ చరిత్రలోనే మూడవ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా నిలిచింది. తన విలువేంటో మరోసారి నిరూపిస్తూ రాహుల్ పరుగుల యంత్రంలా దూసుకుపోతున్నాడు.

## గాయం కారణంగా శివం మావి సీజన్ మొత్తానికి దూరం

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫాస్ట్ బౌలింగ్ విభాగానికి పెద్ద లోటు ఏర్పడింది. యువ పేసర్ శివం మావీ గాయం కారణంగా టోర్నీలోని మిగిలిన మ్యాచ్‌ల నుంచి తప్పుకున్నాడు. ఈ సీజన్‌లో హైదరాబాద్ బౌలింగ్ దళంలో మావీ కీలక పాత్ర పోషిస్తారని అందరూ భావించారు. అయితే, దురదృష్టవశాత్తు వరుస గాయాల సమస్యల వల్ల ఆయన ఈ ఏడాది ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. కీలక సమయంలో ప్రధాన బౌలర్ దూరం కావడం జట్టు వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. శివం మావీ టోర్నీ నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం ఆయనకు గజ్జల గాయం అయింది. టోర్నమెంట్ ప్రారంభం నుంచే ఈ సమస్య ఆయన్ని వేధిస్తోంది. జాతీయ క్రికెట్ అకాడమీలో చికిత్స పొంది, ఫిట్నెస్ పరీక్షలకు హాజరైనప్పటికీ, మైదానంలోకి దిగే స్థాయిలో ఆయన కోలుకోలేకపోయాడు. వైద్య బృందం ఆయనకు పూర్తి విశ్రాంతి అవసరమని సూచించడంతో, ఈ సీజన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ విన్నర్‌గా పేరున్న మావీ ఇలా అర్ధాంతరంగా వైదొలగడం ఫ్రాంచైజీని నిరాశకు గురిచేసింది. మావీ స్థానాన్ని భర్తీ చేయడానికి సన్‌రైజర్స్ యాజమాన్యం వేగంగా పావులు కదిపింది. ఇటీవల ముగిసిన అండర్–19 ప్రపంచ కప్‌లో భారత్ తరపున అద్భుత ప్రదర్శన చేసిన 18 ఏళ్ల యువ ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్‌ను జట్టులోకి ఆహ్వానించింది. ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన అంబరీష్, తన పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను వణికించాడు. యువ ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుండే హైదరాబాద్ ఫ్రాంచైజీ, అంబరీష్‌ను ఎంపిక చేయడం ద్వారా జట్టు సమతుల్యతను కాపాడుకోవాలని చూస్తోంది. ఆర్ఎస్ అంబరీష్ కేవలం బౌలర్ మాత్రమే కాదు, బ్యాట్‌తోనూ రాణించగల సత్తా ఉన్న ఆటగాడు. అండర్–19 ప్రపంచ కప్‌లో 11 వికెట్లు తీసి అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంలో ఇతను దిట్ట. అంతేకాకుండా, లోయర్ ఆర్డర్‌లో వచ్చి భారీ షాట్లు ఆడగల సామర్థ్యం అంబరీష్ సొంతం. మావీ స్థానాన్ని భర్తీ చేయడమే కాకుండా, జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఇతడి రాక దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.గాయాల సమస్యలు ఉన్నప్పటికీ, ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అప్రతిహత విజయాలతో దూసుకుపోతోంది. వరుసగా ఐదు విజయాలను నమోదు చేసిన హైదరాబాద్, ప్రస్తుతం 9 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఇదే జోరును కొనసాగించి ప్లేఆఫ్ బెర్త్ ఖరారు చేసుకోవడమే లక్ష్యంగా జట్టు ముందుకు సాగుతోంది. కొత్తగా చేరిన అంబరీష్ ఐపీఎల్ ఒత్తిడిని అధిగమించి రాణిస్తే, ఈసారి హైదరాబాద్ మూడో టైటిల్ సాధించడం ఖాయంగా కనిపిస్తోంది.

## మీరు చదివే ప్రతిదానిని నమ్మకండి

- **క్రీడా వ్యాఖ్యాత యెషా సాగర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఒక యువ క్రికెటర్ మరియు మహిళా యాంకర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అందులో ఆ క్రికెటర్ ఆమెను తీవ్రంగా నియంత్రిస్తున్నాడని వార్తలు గుప్పుమన్నాయి. జర్నలిస్ట్ అభిషేక్ త్రిపాఠి చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. అధికారికంగా పేర్లు వెల్లడించనప్పటికీ, నెటిజన్లు మాత్రం ఆ జంట సమీర్ రిజ్వీ, యెషా సాగర్ అని ఒక నిర్ణయానికి వచ్చేశారు.సమీర్ రిజ్వీ తనపై మత మార్పిడి కోసం ఒత్తిడి చేస్తున్నాడని, క్రీడా వ్యాఖ్యాతగా పని చేస్తున్న సమయంలో ఇతర క్రికెటర్లతో షేక్ హ్యాండ్ చేయకుండా కేవలం నమస్కారం మాత్రమే చేయాలని షరతులు విధించాడని వార్తలు వచ్చాయి. అంతేకాకుండా, ఆమె సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి కొన్ని రకాల ఫొటోలను తొలగించాలని కూడా ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇవి అత్యంత సున్నితమైన అంశాలు కావడంతో ఈ వివాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది.ఈ వివాదం మరింత ముదురుతుండటంతో యెషా సాగర్ తన సోషల్ మీడియా వేదికగా ఒక రహస్య సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియాలో మీరు చూసే లేదా చదివే ప్రతిదానిని నమ్మకండి" అని ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా సమీర్ రిజ్వీతో తనపై వస్తున్న ఆరోపణలను ఆమె పరోక్షంగా ఖండించారు. అయితే, సమీర్ రిజ్వీ ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరు పక్షాలు ప్రస్తుతం ఈ సున్నితమైన అంశంపై మౌనాన్ని పాటిస్తున్నాయి. యెషా సాగర్ ప్రముఖ క్రీడా వ్యాఖ్యాత, మోడల్. పంజాబ్‌లోని లూధియానాలో జన్మించిన ఆమె, ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లారు. తొలుత పంజాబీ మ్యూజిక్ వీడియోల ద్వారా గుర్తింపు పొందిన ఆమె, తర్వాత క్రీడా రంగంపై ఆసక్తితో వ్యాఖ్యాతగా మారారు. గ్లోబల్ టీ20 కెనడా, యూపీ టీ20 లీగ్, మహిళా ప్రీమియర్ లీగ్ వంటి వేదికలపై ఆమె పనిచేశారు. నివేదికల ప్రకారం, యూపీ టీ20 లీగ్ సమయంలో సమీర్ రిజ్వీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సమీర్ రిజ్వీ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అద్భుతంగా రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో 149.28 స్ట్రైక్ రేట్‌తో 209 పరుగులు చేశారు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడినప్పటికీ, ఈ ఏడాది ఢిల్లీ జట్టులో ఆయన కీలక ఆటగాడిగా మారారు.

# ఎల్ క్లాసికోలో మళ్లీ చెన్నైదే పైచేయి

- **ముంబైపై చెపాక్‌లో**

**8 వికెట్ల ఘన విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్–19లో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూసిన ఎల్ క్లాసికో పోరులో మరోసారి చెన్నై సూపర్ కింగ్స్ సత్తా చాటింది. చెపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసిన చెన్నై ఖాతాలో ఎనిమిది పాయింట్లు చేరాయి.

మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 159 పరుగులకు పరిమితమైంది. చెన్నై బౌలర్ అన్షుల్ కంబోజ్ (3/32) అద్భుత బౌలింగ్‌తో ముంబై టాప్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. ఓపెనర్ రికెల్టన్ (37), నమన్ ధీర్ (57) మాత్రమే కొంత ప్రతిఘటన చూపగా, సూర్యకుమార్ యాదవ్ (21), హార్దిక్ పాండ్యా (18) పెద్ద ఇన్నింగ్స్ ఆడలేకపోయారు.

159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకు ప్రారంభంలోనే బుమ్రా షాక్ ఇచ్చినా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు దిశగా నడిపించాడు. 67 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన గైక్వాడ్‌కు ఇంప్యాక్ట్ సబ్ కార్తిక్ శర్మ (54 నాటౌట్) అద్భుత సహకారం అందించాడు. వీరిద్దరి అర్ధశతక భాగస్వామ్యం ముంబై బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు.

ఉర్విల్ పటేల్ (26) పవర్‌ప్లేలో వేగంగా ఆడగా, అనంతరం గైక్వాడ్–కార్తిక్ జోడీ మ్యాచ్‌ను పూర్తిగా చెన్నై వైపు తిప్పింది. ముంబై బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ చెన్నై 8 వికెట్ల తేడాతో సునాయాసంగా విజయం సాధించింది.

ఈ ఓటమితో ముంబై ప్లే ఆఫ్స్ అవకాశాలు మరింత క్లిష్టమయ్యాయి. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండు విజయాలతో ముంబై పాయింట్ల పట్టికలో వెనుకబడగా, చెన్నై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది.

# పొట్టి ప్రపంచకప్‌కు భారత మహిళల జట్టు ప్రకటన

- **అనుష్క శర్మకు చోటు.. హ్యాట్రిక్ పేసర్ నందినికి పిలుపు**
- **కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో బరిలోకి..**






**బలగం టీవీ, హైదరాబాద్**

వన్డే ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు మరో ఐసీసీ ట్రోఫీపై కన్నేసింది. ఇంగ్లండ్ వేదికగా జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే మహిళల టీ20 ప్రపంచకప్ కోసం భారత సెలెక్టర్లు 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలో జట్టు బరిలోకి దిగనుంది.

డబ్ల్యూపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న అనుష్క శర్మకు జట్టులో చోటు దక్కగా, హ్యాట్రిక్ పేసర్ నందిని శర్మ కూడా ఎంపికైంది. గాయం కారణంగా ఆస్ట్రేలియా పర్యటనకు దూరమైన యస్తికా భాటియా తిరిగి జట్టులోకి వచ్చింది. వన్డే ప్రపంచకప్ ఆడిన జట్టులోని ప్రధాన ఆటగాళ్లను కొనసాగిస్తూ, అనుభవం–యువత కలయికతో జట్టును రూపొందించారు. శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, దీప్తి శర్మ ఆల్‌రౌండర్లుగా చోటు దక్కించుకోగా, అమన్‌జోత్ కౌర్, వైష్ణవీ శర్మలకు ఈసారి అవకాశం లభించలేదు.

ఆస్ట్రేలియా పర్యటనలో భాగమైన భారతి ఫుల్‌మాలి, కష్వీ గౌతమ్, ప్రతీకా రావల్‌లను టీ20 జట్టుకు పక్కన పెట్టినప్పటికీ, లార్డ్స్ వేదికగా జరిగే ఏకైక టెస్టు కోసం ప్రతీకా రావల్‌కు అవకాశం కల్పించారు. హర్లీన్ డియోల్, స్నేహ్ రాణా వంటి సీనియర్లు టెస్టు బృందంలో చోటు దక్కించుకున్నారు.

**టీ20 ప్రపంచకప్ భారత జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, రీచా ఘోష్, యస్తికా భాటియా, రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి, అరుంధతి రెడ్డి, అనుష్క శర్మ, దీప్తి శర్మ, నందిని శర్మ, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్.

**లార్డ్స్ టెస్టు భారత జట్టు:**
హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, ప్రతీకా రావల్, శ్రీ చరణి, యస్తికా భాటియా, నందిని శర్మ, హర్లీన్ డియోల్, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే, స్నేహ్ రాణా.

ఇంగ్లండ్‌తో సిరీస్‌తో పాటు ప్రపంచకప్ సవాల్‌ను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసిన ఈ జట్టు మరోసారి భారత అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతోంది.

## జెమీసన్ ప్రవర్తనపై నెటిజన్ల ఫైర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ప్రతి మ్యాచ్‌లోనూ రికార్డుల వేట కొనసాగిస్తున్నాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన లేటెస్ట్ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడికి ఒక చేదు అనుభవం ఎదురైంది. సాధారణంగా వికెట్ తీసినప్పుడు బౌలర్లు సంబరాలు చేసుకోవడం సహజమే కానీ ఢిల్లీ పేసర్ కైల్ జెమీసన్ మాత్రం హద్దులు దాటి ప్రవర్తించాడు. తనకంటే సగం వయసున్న వైభవ్‌ను అవుట్ చేసిన తర్వాత జెమీసన్ ఇచ్చిన అగ్రెసివ్ సెండ్ ఆఫ్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది. ఒక చిన్న పిల్లాడిపై అంత కోపం చూపించాల్సిన అవసరం ఏముందని నెటిజన్లు జెమీసన్‌ను ఏకిపారేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. మ్యాచ్ రెండో ఓవర్‌లోనే ఈ డ్రామా చోటుచేసుకుంది. జెమీసన్ వేసిన నాలుగో బంతిని వైభవ్ అద్భుతమైన ఫోర్‌గా మలిచాడు. ఆ మరుసటి బంతికే జెమీసన్ ఒక పదునైన ఇన్ స్వింగింగ్ యార్కర్ వేశాడు. ఆ వేగాన్ని అంచనా వేయడంలో విఫలమైన వైభవ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. వికెట్ పడగానే జెమీసన్ ఒక్కసారిగా వైభవ్ వైపు చూస్తూ గట్టిగా అరుస్తూ సెండ్ ఆఫ్ ఇచ్చాడు. ఒక సీనియర్ స్టార్ ప్లేయర్‌ను అవుట్ చేసిన రేంజ్‌లో జెమీసన్ ఇచ్చిన రియాక్షన్ చూసి స్టేడియంలో ఉన్న వారంతా షాక్ అయ్యారు. ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న వైభవ్ కేవలం 4 పరుగులకే వెనుదిరగడం రాజస్థాన్ రాయల్స్‌కు గట్టి దెబ్బే అని చెప్పాలి.ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ కైల్ జెమీసన్‌కు బీసీసీఐ వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఒక డెమెరిట్ పాయింట్‌ను విధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీని అవుట్ చేసిన తర్వాత జెమీసన్ అతనికి చాలా దగ్గరగా వెళ్లి అగ్రెసివ్‌గా ప్రవర్తించాడని ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. ప్రత్యర్థి ఆటగాడిని రెచ్చగొట్టేలా లేదా అవమానించేలా ప్రవర్తించడం ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.5 ప్రకారం నేరం కావడంతో మ్యాచ్ రెఫరీ రాజీవ్ సేథ్ ఈ శిక్షను ఖరారు చేశారు. జెమీసన్ తన తప్పును ఒప్పుకోవడంతో పాటు ఈ జరిమానాను అంగీకరించినట్లు సమాచారం.భారత మాజీ క్రికెటర్ ప్రియాంక్ పాంచల్ ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 31 ఏళ్ల కైల్ జెమీసన్ ఒక 15 ఏళ్ల పిల్లాడిని అవుట్ చేసి అలా ప్రవర్తించడం అస్సలు చూడముచ్చటగా లేదని మండిపడ్డారు. అది అనవసరమైన రియాక్షన్ అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే జెమీసన్‌లో ఉన్న ఆ కసిని చూస్తుంటే వైభవ్ అంటే ప్రత్యర్థుల్లో ఎంత భయం మొదలైందో అర్థమవుతోందని పాంచల్ కౌంటర్ వేశారు. ఒక చిన్న పిల్లాడు కూడా ఇంటర్నేషనల్ స్టార్లను వణికిస్తున్నాడనడానికి జెమీసన్ రియాక్షనే నిదర్శనమని క్రికెట్ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ రెండు అరుదైన ప్రపంచ రికార్డులను అందుకునే అవకాశాన్ని తృటిలో కోల్పోయాడు. టీ20 క్రికెట్‌లో తక్కువ బంతుల్లో 100 సిక్సర్లు బాదిన కీరన్ పొలార్డ్ రికార్డును బద్దలు కొట్టడానికి వైభవ్‌కు కేవలం ఒక్క సిక్సర్ మాత్రమే కావాలి. అలాగే 20 ఏళ్ల వయసు కంటే ముందే 100 టీ20 సిక్సర్లు కొట్టిన మొదటి ప్లేయర్‌గా చరిత్ర సృష్టించే ఛాన్స్ కూడా జెమీసన్ వల్ల మిస్సయ్యింది. ఈ సీజన్ లో ఇప్పటికీ 10 మ్యాచ్‌ల లో 404 పరుగులు చేసిన వైభవ్ సగటు 40.40 గా ఉండగా స్ట్రైక్ రేట్ ఏకంగా 237.64 గా ఉండటం విశేషం. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.వైభవ్ త్వరగానే అవుట్ అయినా రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ మాత్రం తన బ్యాట్?కు పని చెప్పాడు. ఈ సీజన్ లో వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొన్న పరాగ్ ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 50 బంతుల్లోనే 90 పరుగులు చేసి తన విమర్శకుల నోళ్లు మూయించాడు. ధ్రువ్ జురెల్ (40) తో కలిసి నాలుగో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పరాగ్ ఇన్నింగ్స్‌లో భారీ సిక్సర్లు, ఫోర్లు ఉండటంతో రాజస్థాన్ రాయల్స్ పటిష్ట స్థితికి చేరుకుంది.బ్యాటింగ్‌లో రాణించినప్పటికీ రియాన్ పరాగ్ ఒక వివాదంలో చిక్కుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్ లో కూర్చుని వ్యాపింగ్ చేస్తూ కెమెరాకు దొరికిపోవడంతో బీసీసీఐ సీరియస్ అయ్యింది. నిబంధనలను ఉల్లంఘించినందుకు పరాగ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. మైదానం లోపల క్రమశిక్షణ తప్పడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే ఆ వివాదాన్ని పక్కన పెట్టి పరాగ్ ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ సాధించడం టీమ్‌కు కలిసొచ్చింది. చివర్లో డోనోవన్ ఫెరీరా కేవలం 14 బంతుల్లోనే 47 పరుగులు చేయడంతో రాజస్థాన్ 20 ఓవర్లలో 225/6 భారీ స్కోర్ సాధించింది. కానీ ఆ తరువాత బౌలర్లు వికెట్లు తీయకపోవడంతో ఢిల్లీ గెలిచింది.

## రిటైర్మెంట్ ఆలోచన లేదు: స్టార్క్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. సుదీర్ఘ విరామం, గాయాల తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్టేడియంలో అడుగుపెట్టాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్ తన రీ–ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ బ్యాటర్లను వణికించి 3 కీలక వికెట్లు పడగొట్టి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే మ్యాచ్ సమయంలో స్టార్క్ బౌలింగ్ చేతికి భారీగా కట్టు ఉండటం చూసి అతని ఫిట్ నెస్ ఇంకా పూర్తిస్థాయిలో లేదని.. త్వరలోనే ఆయన ఆటకు స్వస్తి పలుకుతాడని సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఈ పుకార్లకు మిచెల్ స్టార్క్ మ్యాచ్ అనంతరం ముగింపు పలికాడు. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి నాకు అలాంటి ఆలోచనే లేదు. చేతికి కట్టు ఉండటం చూసి రిటైర్మెంట్ గురించి మాట్లాడటం కాస్త వింతగా ఉంది. నేను ఇంకా ఆ దశకు చేరుకోలేదని భావిస్తున్నాను" అని మిచెల్ స్టార్క్ స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉండి.. కేవలం ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకోవడంపైనే దృష్టి సారించానని, ఇప్పుడు మైదానంలోకి తిరిగి రావడం తనలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని స్టార్క్ కుండబద్దలు కొట్టాడు. 35 ఏళ్ల వయసులో కూడా తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఈ సందర్భంగా స్టార్క్ చాటిచెప్పాడు.రాజస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభమైన మొదటి ఓవర్‌లోనే మిచెల్ స్టార్క్ తన సత్తా ఏంటో చూపించాడు. యువ సంచలనం యశస్వి జైస్వాల్ మొదటి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్‌తో స్టార్క్‌ను స్వాగతించినప్పటికీ.. స్టార్క్ మాత్రం తడబడలేదు. మూడో బంతికే అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను ఔట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆ తర్వాత సెంచరీకి చేరువవుతున్న రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌తో పాటు రవీంద్ర జడేజా వికెట్లను కూడా తీసి రాజస్థాన్ స్కోరు వేగానికి బ్రేకులు వేశాడు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి తన రాకను ఘనంగా చాటాడు.దాదాపు 3 నెలల పాటు ఏ బ్యాటర్‌కు బౌలింగ్ చేయకుండా నేరుగా ఐపీఎల్ లాంటి హై–వోల్టేజ్ టోర్నీలో ఆడటం అంత సులభం కాదని స్టార్క్ అంగీకరించాడు. "బౌలింగ్ స్పీడ్ అందుకోవడానికి, మ్యాచ్ రిథమ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ నాకు బాగా ఉపయోగపడింది. నా మోచేయి గాయం కారణంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. దానికి తగ్గట్టుగా బౌలింగ్ శైలిని మార్చుకుంటున్నాను. ఈ విజయం జట్టుకు ఎంత ముఖ్యమో, నా ఆత్మవిశ్వాసానికి కూడా అంతే ముఖ్యం. రాబోయే మ్యాచ్‌ల్లో నా బౌలింగ్ ప్రదర్శన మరింత మెరుగుపడుతుందని నమ్ముతున్నాను" అని స్టార్క్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

## బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..

**ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకున్న వైనం**



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్‌ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాల చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది. పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న క్ష్మక్ష్మ జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధృవ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

## వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్ నుంచి తొలగించాలి

**ఓ యాక్టివిస్ట్ డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని వెంటనే ఐపీఎల్ నుంచి తొలగించాలని ఓ యాక్టివిస్ట్ డిమాండ్ చేశాడు. లేకపోతే రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. 15 ఏళ్ల పిల్లాడు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడకూడదని, ఇలా చేయడం చైల్డ్ లేబర్ కిందకు వస్తుందని పేర్కొన్నాడు. వైభవ్ సూర్యవంశీ క్రికెట్‌ను పక్కనపెట్టి చదవుకోవాలని హితవు పలికాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే 12 ఏళ్ల వయసు నుంచే వైభవ్ సూర్యవంశీ ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నాడు.బిహార్ తరపున 12 ఏళ్ల వయసులోనే దేశవాళీ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. ఆ తర్వాత భారత అండర్ 19 జట్టుకు ఎంపికైన వైభవ్.. ఆసియా రైజింగ్ స్టార్స్ టోర్నీలో కూడా బరిలోకి దిగాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు.14 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేయడంతో పాటు 35 బంతుల్లోనే సెంచరీబాది ఈ ఘనతను అందుకున్న పిన్న వయస్కుడిగా చరిత్రకెక్కాడు. ఇటీవలే 15వ జన్మదినం జరుపుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో దుమ్మురేపుతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. 10 మ్యాచ్‌ల్లో 404 పరుగులు చేసి అత్యధిక పరుగుల బ్యాటర్ల జాబితాలో టాప్ 4లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. అతను ఆడినా.. విఫలమైనా దేశం మొత్తం చర్చించుకుంటున్నారు. ఐకాన్ ప్లేయర్‌గా ఎదిగిన వైభవ్ సూర్యవంశీపై కన్నడ టీవీ ప్రోగ్రామ్‌లో యాక్టివిస్ట్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి సంచలన వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను ఐపీఎల్ నుంచి తొలగించి స్కూల్‌కు పంపాలని డిమాండ్ చేశాడు. లేదంటే లేబర్ చైల్డ్ యాక్ట్ కింద వేస్తానని హెచ్చరించాడు. భారత బాల కార్మిక నిరోధక సవర్ణ చట్టం 2016 ప్రకారం.. 14 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలతో పని చేయించకూడదు. అయితే సాధారణంగా బాల క్రీడాకారులను చైల్డ్ లేబర్‌గా పరిగణించరు. వారి ప్రతిభను ప్రోత్సహిస్తారు. క్రికెట్ ఒక్కటే కాదు ఇతర క్రీడల్లోనూ 10 ఏళ్ల వయసులోనే ఆడటం మొదలు పెడుతారు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌తో సత్కరించింది. కాబట్టి సెన్సేషన్ కోసం సదరు యాక్టివిస్ట్ ఈ వ్యాఖ్యలు చేశాడని నెటిజన్లు కొట్టిపారేస్తున్నారు.

# పృథ్వీరాజన్ సుకుమారన్... ఐ నోబడీ



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.

# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు



టాలెంట్‌ను ప్రోత్సహిచే విధంగా మార్పులు ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది.

యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ఎఞజీటపా ఃజీనిబ ఎఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.

# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు



రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# జూన్ 26న లెనిన్ విడుదల







'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతుందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 94 ఏళ్ల వయసులు సింగీతం మెగాఫోన్



## సింగ్ గీతం మూవీతో మళ్లీ సత్తా చాటేందుకు రెడీ

భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.

# ఫ్యాన్స్ నుంచి డబ్బులు గుంజడం సరికాదు

## దర్శకుడు రవిబాబు సంచలన కామెంట్స్



వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రవిబాబు, సినిమా టికెట్ల ధరలు, ఫ్యాన్స్ షోల గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన స్వీయ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం రేజర్ . ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు రవిబాబు. అయితే ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఫస్ట్ డే ఫస్ట్ షోకి టాలీవుడ్‌లో టికెట్ రేట్లు పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సినిమా విడుదలైన మొదటి రోజు థియేట ర్లకు వచ్చే ఫ్యాన్స్ దగ్గర ఎక్కువ డబ్బులు వసూలు చేయడం చాలా తప్పని తెలిపిన రవిబాబు మొదటి రోజు అభిమానులకు సినిమాను ఉచితంగా చూపించాలని అన్నారు. అభిమాన హీరో సినిమాను భుజా న వేసుకుని మోసేది వారే. అటు వంటి వారిపై అదనపు భారం వేయడం సరికాదు అంటూ రవి బాబు అభిప్రాయపడ్డారు. ఈ సం దర్భంగా పెద్ద సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరలు పెంచ డం వల్ల సామాన్య అభిమానులు ఇబ్బంది పడుతున్నారని, దీనిని మార్చాలని ఆయన సూచించారు.